
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత గురువారం గరిష్ఠం : 36.0 కనిష్ఠం : 24.0
ANDHRAJYOTHY
5

అనంతపురం
జిల్లా వార్తలు
శుక్రవారం 11 జూలై 2025


పిల్లలూ.. నమస్కారం.. బాగున్నారా..?


హాజరైన తల్లిదండ్రులు, విద్యార్థులు



మెగా పీసీఎం 2.0

- పాఠం చెప్పిన సీఎం చంద్రబాబు
- శ్రద్ధగా విన్న మంత్రి నారా లోకేశ్
- కొత్తచెరువు జడ్పీ పాఠశాలలో పండుగ
- బిడ్డలను బాగా చదివిస్తే మంచి రోజులు
- తల్లిదండ్రులకు ముఖ్యమంత్రి సూచన


గ్రీన్ కార్డు ప్రదర్శన

అనంతపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి పాఠం చెప్పే మాస్టారు అయ్యారు. విద్యాశాఖ మంత్రి విద్యార్థిగా మారి, ఫస్ట్ బెంచ్‌లో కూర్చున్నారు. ఆ తరగతి గదిలో పిల్లలు ఎన్నడూ లేనంత హుషారుగా మారిపోయారు. పాఠం చక్కగా విన్నారు. అడిగిన ప్రశ్నలకు టక టకా సమాధాలు ఇచ్చారు. కొత్తచెరువు జడ్పీ ఉన్నత పాఠశాల ఈ అరుదైన ఘట్టానికి వేదికగా మారింది. గురు పౌర్ణమిని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా గురువారం మెగా టీచర్స్, పేరెంట్స్ మీటింగ్ 2.0ను నిర్వహించారు. ఇందులో భాగంగా, కొత్తచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించి, కార్యక్రమానికి స్వయానా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వచ్చారు. ఆయన తనయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దగ్గరుండి ఈ కార్యక్రమాన్ని నడిపించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

సీఎం రాగానే సందడి..

పుట్టపర్తి విమానాశ్రయం నుంచి కొత్తచెరువుకు సీఎం కాన్వాయ్ చేరుకోగానే సందడి మొదలైంది. జూనియర్ కాలేజీ వద్ద నుంచి ఉన్నత పాఠశాల వరకూ ఎన్‌సీసీ కేడెట్లు మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తూ సీఎంను సగౌరవంగా తీసుకెళ్లారు. విద్యార్థులు, తల్లిదండ్రులను ముఖ్యమంత్రి ఆప్యాయంగా పలకరించారు. అందరి యోగక్షేమాలు

(మిగతా 6లో...)

సీమ కరువును శాశ్వతంగా తరిమేద్దాం

- పరిష్కారానికి ప్రణాళిక సిద్ధం చేయండి
- దేశాభివృద్ధిలో రైతుల పాత్ర కీలకం
- కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్


కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కేంద్రమంత్రి శివరాజ్ సింగ్‌చౌహాన్

పుట్టపర్తి టౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లో కరువు నివారణకు శాశ్వత పరిష్కారం కొనుగొందామని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ పేర్కొన్నారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లో గురువారం ఆయన రాష్ట్రంలోని కరువు పీడిత జిల్లాల సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి అచ్చెన్నాయుడు, డైరెక్టర్ ఢిల్లీరావు, హార్టికల్చర్, సెరికల్చర్ కమిషనర్ శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, అనంతపురం, కర్నూలు, శ్రీ సత్యసాయి జిల్లాల జేసీలు శివనారాయణ, నవ్య, అభిషేక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ జిల్లాల్లో కరువును శాశ్వతంగా నివారించాలన్నదే కేంద్రం ముఖ్య (మిగతా 7వ పేజీలో...)

ఎప్పుడూ ఇంతేనా..?





- ఎంపీఈఓలకు రెన్యువల్ కష్టాలు
- ప్రతి సంవత్సరం తప్పని తిప్పలు
- నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్
- సమాన పనికి సమాన వేతనం ఎప్పుడో...?

అనంతపురం అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఎంపీఈఓలను రెన్యువల్ కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రతి ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి వచ్చే ఏడాది మార్చి నెలా ఖరుదాకా రెన్యువల్ చేస్తూ జీవో జారీ చేయాల్సి ఉంది. ఆర్థిక సంవత్సరం ముగిసి మూడు నెలలు దాటినా 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రెన్యువల్ జీవో జారీ చేయకపోవడంతో బాధిత ఎంపీఈఓలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్

వ్యవసాయ శాఖ పరిధిలో ఉమ్మడి జిల్లాలో 323 మంది ఎంపీఈఓలు పనిచేస్తున్నారు. ఇందులో అనంత జిల్లాలో 189 మంది, శ్రీ సత్యసాయి జిల్లాలో 134 మంది ఎంపీఈఓలు పని చేస్తున్నారు. వీరికి నెలకు రూ.12వేలు వేతనంతోపాటు మరో రూ.3వేలు ఇన్సెంటివ్ ఇస్తున్నారు. అయితే గత నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. 2015 సంవత్సరంలో


రైతు సేవా కేంద్రం (ఫైల్)

కాంట్రాక్టు పద్ధతిలో ఎంపీఈఓలను ఉద్యోగంలోకి తీసుకున్నారు. అప్పట్లో ప్రతి ఏడాది సకాలంలో రెన్యువల్ జీవోను జారీ చేసేవారు. అయితే గత వైసీపీ పాలనలో ప్రతి ఏడాది నాలుగు నెలలు ఆలస్యంగా రెన్యువల్ జీవో ఇస్తూ వచ్చారు. దీంతో ప్రతి సారి ఐదు నెలలు వేతనాలు పెండింగ్‌లో పెడుతూ వచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరినా వారి కష్టాలు తీరలేదు. కమిషనరేట్ ఉన్నతాధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆర్థిక సంవత్సరం ఆరంభానికి ముందే జిల్లా వ్యవసాయ అధికారులతో ఎంపీఈఓల వివరాలు తెప్పించుకొని, ప్రభుత్వానికి రెన్యువల్ కోసం ఫైల్ పెట్టడంలో రాష్ట్ర కమిషనరేట్ అధికారులు అశ్రద్ధ వహిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రెన్యువల్ ఫైల్ ఆర్థికశాఖ వద్ద ఉన్నట్లు సమాచారం.

సమాన పనికి సమాన వేతనం ఇచ్చేదెన్నడో..?

అనంత జిల్లాలో 451 రైతు సేవా కేంద్రాలున్నాయి. ఇందులో 126 మంది విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, 180 మంది విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు, 12 మంది సెరికల్చర్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 420 రైతు సేవా కేంద్రాలున్నాయి. ఇందులో 124 మంది విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, 143 మంది విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు, 73 మంది సెరికల్చర్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 323 మంది ఎంపీఈఓలు విధులు నిర్వర్తిస్తున్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది చేసే విధులే (మిగతా 6లో...)

అక్షరాస్యతతోనే అభివృద్ధి

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ చౌదరి

సొంతూరి పాఠశాలలో మెగా పీటీఎం 2.0


పెరవలి జిల్లాపరిషత్ పాఠశాలలో మాట్లాడుతున్న ప్రభాకర్ చౌదరి

శింగనమల, జూలై 10(ఆంధ్రజ్యోతి): అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమనే విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించి తమ పిల్లలను బాగా చదివించాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. తన స్వగ్రామమైన మండలంలోని పెరవలి జడ్పీ హైస్కూల్లో గురువారం నిర్వహించిన మెగా పీటీఎం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల తల్లిదండ్రులు తమ పిల్లల చదువు పట్ల శ్రద్ధ చూపే అవకాశం ఉంటుందన్నారు. అందరూ విద్యావంతులైన గ్రామం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, రాత్రి సమయంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, గోడ నిర్మించాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అధికారులతో చర్చించి ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తానని ప్రభాకర్‌చౌదరి వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 శివప్రసాద్, హెచ్‌ఎం హరినాథ్, టీడీపీ సీనియర్ నాయకుడు మారుతీ నాయడు, స్కూల్ కమిటీ చెర్మన్ వరదరాజులు, సర్పంచ్ ఎం.రాజు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

24 గంటలు.. 70వేల చదరపు మీటర్లు

హంద్రీనీవా లైనింగ్ పనుల్లో రికార్డు

6

కంది కిట్లు స్వాహా

- వేలిముద్ర తీసుకుని కందులు ఇవ్వని వైనం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన రైతు


పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్న రైతు గోపాల్

శెట్టూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మినీకిట్ల రూపంలో రైతులకు పంపిణీ చేయడానికి మండలానికి సరఫరా చేసిన 35 క్వింటాళ్ల కందులను సచివాలయ విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు స్వాహా చేశారని పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు అందింది. రంగయ్యపాలెం గ్రామానికి చెందిన రైతు గోపాల్ గురువారం ఈమేరకు ఫిర్యాదు చేశాడు. తన భార్య శ్యామలమ్మతో కందుల ప్యాకెట్ల కోసం వేలిముద్ర వేయించుకుని తర్వాత ఇస్తానని ములకలేడు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ నమ్మబలికాడు. ఆ తర్వాత తమ కళ్ల ముందే కారులో 20 ప్యాకెట్లు కందులు తీసుకువెళ్లాడని బాధిత రైతు విలేకరులకు తెలిపారు. మండల పరిధిలోని చింతలపల్లి గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ కూడా ఉచితంగా ఇవ్వాల్సిన మినీ కిట్లకు డబ్బులు వసూలు చేసినట్లు రైతులు ఆరోపించారు. వ్యవసాయ అధికారులు శెట్టూరు మండలంలో పంపిణీ చేసిన మినీ కిట్ల వ్యవహారాన్ని పూర్తిగా విచారణ చేపడితే మరికొన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయని పలువురు రైతులు చెబుతున్నారు.

చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేస్తా..



మండలంలోని 13వ గ్రామ సచివాలయంలో కందుల పంపిణీని జరిగిన అక్రమాలపై విచారిస్తాం. అక్రమాలకు పాల్పడి సిబ్బంది పై చర్యలకు ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తా.

- వాసుకిరాణీ, వ్యవసాయాధికారి, శెట్టూరు

వందనం.. అభివందనం

- వేడుకగా మెగా పీటీఎం
- జిల్లా వ్యాప్తంగా స్కూళ్లు, కాలేజీల్లో సంబరాలు
- లక్షలాది విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్ల కలయిక
- గురువులు, తల్లులకు పిల్లల పాదాభివందనాలు
- తల్లిదండ్రులకు ఆటలపోటీలు, సహపంక్తి భోజనాలు
- కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు, అధికారులు


అనంతపురం నగరంలోని కేఎస్ఆర్ కళాశాలలో బాలికలతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్..

అనంతపురం విద్య, జూలై 10(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మెగా పీటీఎం 2.0ను గురువారం ఘనంగా నిర్వహించారు. 2511 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. విద్యాశాఖ, ఎస్ఎస్ఏ అధికారులు, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సమన్వయంతో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు ఈవేడుకల్లో పాల్గొన్నారు. విద్యాశాఖ అధికారుల లెక్కల మేరకు మెగా పీటీఎం కార్యక్రమానికి ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 3,47,940 మంది, తల్లిదండ్రులు మూడు లక్షల మంది, 11వేల మంది ఉపాధ్యాయులు వారి వారి పాఠశాలల్లో ఒకేరోజు చదువుల పండుగను సంతోషంగా జరుపుకున్నారు. 96 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లోనూ మెగా పీటీఎం వేడుకలు నిర్వహించారు.

తల్లిదండ్రులకు ఆటల పోటీలు

మెగా పీటీఎం కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రులతో విద్యార్థులు, టీచర్లు సంతోషంగా గడిపారు. వచ్చిన తల్లిదండ్రులకు పాఠశాలలో ఆటలపోటీలు నిర్వహించారు. అంతకుముందు గురువులు, తల్లిదండ్రులకు విద్యార్థులు పాదాభివందనం చేసి వారి ప్రాధాన్యం వివరించారు. అమ్మపేరుతో ఓమొక్కను ప్రతివిద్యార్థి తమ తల్లుల సమక్షంలో నాటారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

వెల్లివిరిసిన ఆనందం

పేరెంట్స్ మీటింగ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌తో కలిసి ఉరవకొండలోని ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో నిర్వహించిన మీటింగ్‌లో పాల్గొన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తాడిపత్రి మండలం సజ్జలదిన్నె జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకలకు హాజరయ్యారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కనగానపల్లి కేజీబీవీ, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు రాయదుర్గంలోని బాలగంగాధర్ తిలక్ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ జిల్లాకేంద్రంలోని కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఎస్కేడీ నగరపాలక హైస్కూల్‌లలో జరిగిన చదువుల పండుగలో పాల్గొన్నారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే శెట్టూరు జడ్పీ ఉన్నతపాఠశాలలో, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ నార్పలలో మెగా పీటీఎంలో పాల్గొన్నారు. తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి తాడిపత్రిలోని కేజీబీవీలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. ఇతర మండలాలల్లో అక్కడి అధికారపార్టీల నేతలు. ప్రజాప్రతినిధులు, దాతలు, పూర్వ విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


యల్లనూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉత్సాహంగా టగ్ ఆఫ్ వార్

ప్రైవేట్‌కు దీటుగా..



నేను పిల్లలకు ట్యూషన్లు చెప్పి బతుకుతున్నా. నా కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నా. ప్రస్తుతం ఆమె కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఇక్కడ ప్రైవేట్ కాలేజీల కంటే బాగా చదువు చెబుతున్నారు. మరో వైపు తల్లికివందనం పథకం ద్వారా నగదు నా బ్యాంకు ఖాతాలోకి జమ చేశారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయం.

- సరస్వతి, విద్యార్థితల్లి, అనంతపురం

అందరికీ చదువు



ఆర్థికస్తోమత లేకపోవడంతో ఎంతోమంది చదువుకోలేక పోతున్నారు. ఇపుడు ఇంటర్ విద్యార్థులకు కూడా తల్లికివందనం పథకం ఇస్తున్నారు. మధ్యాహ్నభోజనం అమలు చేస్తున్నారు. ఇది అందరు పిల్లలు చదువుకోవడానికి అవకాశం కల్పిస్తోంది. నేను అంధుడినిజ. నా కుమార్తె పదో తరగతి పాసైన తర్వాత విజయవాడలో చేర్పిద్దామనుకున్నా. కానీ ఎవరో కేఎస్ఆర్ కాలేజీ బాగుందని చెబితే ఇక్కడ చేర్పించా. మా అమ్మాయి చదువులో చక్కగా రాణిస్తోంది. సీఎం, మంత్రి లోకేశ్ అమలు చేస్తున్న విద్యాసంస్కరణలు అద్భుతం.

- శివశంకరప్ప, విద్యార్థి తండ్రి, అనంతపురం

ప్రభుత్వ చేయూత మరువలేం..



పేదపిల్లల చదువుకు ప్రభుత్వం అందిస్తున్న చేయూత మరువలేనిది. మాది చాలా పేద కుటుంబం. ఇంటర్‌కు కేఎస్ఆర్‌లో చేరా. హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నా. తల్లికి వందనం, మధ్యాహ్నభోజనం పథకాలు చక్కగా అమలు చేస్తున్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న చేయూతను విద్యార్థులుగా మేము సద్వినియోగం చేసుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుంది.

- షేక్ పర్వీన్, విద్యార్థిని, అనంతపురం

చదువే సంకల్పం..

చదువుకుంటాం: విద్యార్థులు
పిల్లలను చదివించుకుంటాం: తల్లిదండ్రులు
మెగా పీటీఎంలో అలరించిన ప్రసంగాలు
మంత్రముగ్ధుడైన సీఎం చంద్రబాబు

కొత్తచెరువు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చదువే తమ సంకల్పమని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉద్ఘాటించారు. వ్యసనాల జోలికెళ్లకుండా పెద్దలు, గురువుల పట్ల భక్తితో శ్రద్ధగా చదువుకుంటామనీ, తల్లిదండ్రుల కలలను నెరవేరుస్తామని విద్యార్థులు ఉద్ఘాటించారు. తల్లికి వందనంతో తమ పిల్లలను చదివించుకునే అవకాశం దక్కిందనీ, వారిని ఉన్నత చదువులు చదివిస్తామని తల్లిదండ్రులు తెలిపారు. మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన మెగా పీటీఎం-2.0 కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న నిర్ణయాలు విద్యాభివృద్ధికి ఎలా కారణమవుతున్నాయో, తమ జీవితాల్లో ఎలాంటి మార్పులు తెస్తున్నాయోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వివరించారు. వారి ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రముగ్ధుడయ్యారు. విద్యార్థి చరణ్‌తేజ్‌ను శాలువాకప్పి, సత్కరించారు. రాజకీయ నాయకులు కూడా ఇంత చక్కగా మాట్లాడరంటూ ప్రశంసించారు. విద్యార్థినులు పూజిత, అమ్మాజాన్ కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

తల్లికి వందనంతో చదువుకు బాసట



నా మిత్రుడిది పేద కుటుంబం. గతంలో కుటుంబంలో ఒకరికే అమ్మఒడి రావడంతో మిగతా ఇద్దరినీ బడి మాన్పించారు. ఇపుడు అందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేస్తున్నారు. అందరికీ చదువుకునే భాగ్యం కల్పిస్తున్నారు. నాకు అందిన తల్లికి వందనం సొమ్మును వృథా చేయను. ఉన్నత చదువులు చదువుతా. సీఎం చంద్రబాబు రుణం తీర్చుకుంటా. **- చరణ్ తేజ్, 9వ తరగతి**

మీరే నాకు ఆదర్శం..



ముఖ్యమంత్రి చంద్రబాబు సుదీర్ఘ రాజకీయ అనుభవం, కార్యదక్షత, పట్టుదలే నాకు ఆదర్శం. అదే స్ఫూర్తితో ఇంటర్మీడియట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి, 963 మార్కులు సాధించా. జిల్లా టాపర్‌గా నిలిచా. అమరావతిలోని విట్ కళాశాల యాజమాన్యం ఉచిత సీటు ఇచ్చింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఉన్నత చదువులు అభ్యసిస్తా.

- విట్ కళాశాలలో ఉచిత సీటు సాధించిన నవరత్న

పిల్లలను చదివించుకుంటామో.. లేదోనన్న భయం ఉండేది



ప్రస్తుతం చదువు వ్యాపారంగా మారింది. మా పిల్లలను చదివించుకుంటామో.. లేదోనన్న భయం ఉండేది. ప్రభుత్వ పాఠశాలల్లో నలుగురు పిల్లలు చదువుతున్నారు. గతంలో ఒకరికే అమ్మఒడి కింద నగదు వచ్చింది. దీంతో మిగిలిన పిల్లల చదువు కోసం అప్పు చేయాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ భయం లేదు. మా పిల్లలందరికీ రూ.13వేలు చొప్పున రూ.52 వేలు వచ్చింది. ఈ డబ్బుతో పిల్లలను చదివించుకుంటా. **- వడ్డే పద్మావతి**

పిల్లలను చదివించి.. చంద్రన్న రుణం తీర్చుకుంటా



రోజూ కూలికెళ్తేగానీ మా కుటుంబం గడవదు. నాకు నలుగురు పిల్లలున్నారు. వారిని చదివించుకోలేక ఒకరిని మాతోపాటు కూలి పనికి తీసుకెళ్తున్నాం. మిగిలిన ముగ్గురిని చదివించుకోవడానికి అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం కింద డబ్బు ఇచ్చింది. దీంతో నలుగురు పిల్లలను ఉన్నత చదువులు చదివించి, చంద్రబాబు రుణం తీర్చుకుంటాను. **-రామాంజమ్మ**

అమ్మా.. నీ మాట నెరవేరుస్తా..

వ్యసనాలకు, చెడు సావాసాల జోలికి వెళ్లను. ఉపాధ్యాయులు, మీరు చెప్పిన విధంగానే నడుచుకుంటా. పెద్దలను గౌరవిస్తూ ఉన్నతస్థాయికి ఎదుగుతానని హామీ ఇస్తున్నా. అమ్మా.. నీ మాట నెరవేరుస్తానని చంద్రన్న సాక్షిగా ప్రమాణం చేస్తున్నా.

-సాయిప్రజ్వల్, విద్యార్థి

పేదల బతుకుల్లో వెలుగులు నింపారు..

తల్లికి వందనం పేరుతో మాలాంటి పేద కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న మహనీయుడు చంద్రన్న. గురుపౌర్ణమి రోజున చంద్రన్నను దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నా. నా కొడుకును ఉత్తమ విద్యార్థిగా తీర్చిదిద్దుతా.

-భవాని



బడిలో మెగా పీసీఎం..2.0

(5వ పేజీ తరువాయి)

తెలుసుకున్నారు. బిడ్డలను బాగా చదవించాలని, చదువుకుంటే ఉన్నతంగా ఎదుగుతారని వారికి వివరించారు. విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులను పరిశీలించి, మరింత బాగా చదవాలని ప్రోత్సహించారు. వైదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం మొత్తం చదువులు, భవిష్యత్తు, ప్రభుత్వ చేయూత, సంస్కరణలు, భవిష్యత్తుపై భరోసా.. ఇవే అంశాలపై సాగింది. రాజకీయాలకు తావులేకుండా కొనసాగింది. ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. సౌకర్యాలు కల్పించే, సమస్యలను పరిష్కరించే బాధ్యత తాను తీసుకుంటానని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతను గురువులు తీసుకోవాలని సూచించారు. కొత్తచెరువు స్కూల్ వాతావరణాన్ని చూస్తుంటే తనకు మళ్లీ చదువుకోవాలని అనిపిస్తోందని సీఎం చంద్రబాబు అన్నారు. మంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఇక్కడ ఉందని అన్నారు.

విద్యాదానం గొప్పది...

మంచి సమాజం కోసం అందరూ బాధ్యతాయుతంగా ముందుకు నడుద్దామని చంద్రబాబు పిలుపునిచ్చారు. అన్నదానం... వస్త్ర దానం... గోదానం కన్నా... విద్యాదానం గొప్పదని సీఎం అన్నారు. అలాంటి విద్యను అందించే టీచర్లను అభినందిస్తున్నానని అన్నారు. పిల్లల్లో బాధ్యత పెరగాలని, తల్లిమీద ప్రేమ, భక్తి భావం కలిగి ఉండాలని అన్నారు. తల్లిని ఆఖరు దాకా బాగా చూసుకునేందుకే తల్లికి వందనం ఇచ్చామని అన్నారు. అబ్దుల్ కలాం ఇంటింటికీ న్యూస్ పేపర్ వేసి, ఆ డబ్బులతో చదువుకున్నారని అన్నారు. అందుకే ఆయన మిసైల్ మ్యాన్ అయ్యారని అన్నారు. అంబేడ్కర్ వీధి దీపాల వెలుగులో చదివి, రాజ్యాంగాన్ని రచించి, రాజ్యాంగ నిర్మాతగా స్ఫూర్తినిచ్చారని కొనియాడారు. మన పిల్లల్లోనూ చాలా శక్తి సామర్థ్యాలు ఉన్నాయని, వారి ప్రతిభను వెలికితీసి అత్యంత శక్తువంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత గురువులు, తల్లిదండ్రులపై ఉందని అన్నారు.



మీకోసం.. మంచి భోజనం

సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆహార పదార్థాల నాణ్యత, రుచి బాగుందని సీఎం కితాబిచ్చారు. భోజనం చేస్తూనే విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ముచ్చటించారు. మధ్యాహ్న భోజనం ప్రతి రోజూ ఇలాగే ఉంటుందా? తాము వచ్చామని ఇలా ఉందా? అని ఆరా తీశారు. ప్రతి రోజు ఇట్లాగానే ఉంటుందని బాలికలు బదులిచ్చారు. పాఠశాలలో అందరూ భోజనం చేస్తారా..? ఇంటి నుంచి తెచ్చుకుంటారా..? అని కూడా ఆరా తీశారు. అందరూ పాఠశాలలో భోజనాన్నే తింటున్నారని విద్యార్థులు ముఖ్యమంత్రికి తెలిపారు. మధ్యాహ్న భోజనం గతంలో బాగుండేది కాదు, అందుకే సన్న బియ్యంతో వండాలని సీఎం సూచించారు.. అని మంత్రి లోకేశ్ విద్యార్థులకు తెలిపారు.

10వ తరగతి విద్యార్థులతో..

పదో తరగతి విద్యార్థులతో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఇష్టాగోష్ఠి నిర్వహించారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముఖాముఖీగా మాట్లాడారు. విద్యార్థుల విద్యా ప్రగతి, అభిరుచులు, ప్రవర్తన, ఆరోగ్యం, హాజరు తదితర అంశాల గురించి చర్చించారు. హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులు రిహాన్ బాషా, పి.జిష్ణు ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించారు. వారి మార్కులను అడిగి తెలుసుకున్నారు. వారి తల్లిదండ్రులతో సీఎం మాట్లాడుతూ, పిల్లల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం విద్యార్థి మణికొండ సూర్యతేజ సీఎం చంద్రబాబుపై రాసిన కవిత్వాన్ని చదివి వినిపించారు. సీఎం ఆ విద్యార్థిని అభినందించారు. భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆశీర్వదించారు.

మీ పిల్లల కోసం సీఎం వచ్చారు

నా కోసం అప్పట్లో నాన్న రాలేదు : మంత్రి నారా లోకేశ్



అనంతపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): 'నేను చదువుకునే రోజుల్లో పేరెంట్ మీట్‌కు మా నాన్న వచ్చేవారు కాదు. మా అమ్మే వచ్చేది. నా కుమారుడు దేవాన్ష్ పేరెంట్ మీట్‌కు నేను వెళ్లలేని పరిస్థితి ఉంది. నా భార్య బ్రాహ్మిణి వెళతోంది. కానీ మీ పిల్లల మీ పేరెంట్ మీట్‌కు సాక్షాత్తు సీఎం చంద్రబాబునాయుడు హాజరయ్యారంటే.. పిల్లల భవిష్యత్తుపై ఆయనకు ఎంత బాధ్యత ఉందో అర్థం చేసుకోవాలి' అని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థుల తల్లిదండ్రులనుద్దేశించి అన్నారు. కొత్తచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పీటీఎం 2.0లో ఆయన ప్రసంగించారు. బయటి పాఠశాలల్లో పిల్లలను బాయిలర్ కోళ్లలాగా రూంలో కట్టేస్తారని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు ఆటలు, పాటలతోపాటు యోగా కూడా నేర్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ఎప్పుడూ లేని విధంగా ఈ సారి పది, ఇంటర్‌లో మంచి ఫలితాలు వచ్చాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో రాజకీయాలు ఉండవని, కేవలం పాఠాలే చెప్పాలని ఉపాధ్యాయులకు సూచించారు. అందుకే తాము ఇచ్చిన పుస్తకాలు, బ్యాగ్‌లపై సీఎం చంద్రబాబు ఫొటో లేదని, రాజకీయ పార్టీల రంగులు లేవని అన్నారు.

పవన్ అన్న సవాల్‌ను స్వీకరిస్తున్నా...

తనకు సోదర సమానులు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోటి మొక్కలు నాటాలని సవాల్ విసిరారని, తాను స్వీకరిస్తున్నానని లోకేశ్ అన్నారు. మొక్కలు పెంచడం అనేది పవిత్రమైన బాధ్యతఅన్నారు. విద్యాశాఖ తీసుకున్నప్పుడు అంత కఠినమైన శాఖ నీకు అవసరమా అని కొందరు అన్నారని అన్నారు. తాను ఒక్కటే చెప్పానని, కఠినమైన శాఖ కాబట్టే విద్యా శాఖను ఇష్టంగా ఎంచుకున్నానని బదులిచ్చానని అన్నారు. మన పిల్లల భవిష్యత్తు కోసం సంస్కరణలు తీసుకొచ్చేందుకు విద్యా శాఖ మంత్రిగా కృషి చేస్తున్నానని అన్నారు. సెమిస్టర్‌లవారీగా పుస్తకాల బరువును తగ్గించి, నాణ్యమైన విద్యను అందించేందుకు చొరవ చూపుతున్నామని అన్నారు. 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించామని, ఆగస్టులో కొత్త టీచర్లను పాఠశాలలకు పంపిస్తామని అన్నారు. కాలం మారిందని, విలువలు పడిపోయాయని, ఇది గుర్తించిన సీఎం చంద్రబాబు విలువలతో కూడిన విద్యను అందించాలని సంకల్పించారని అన్నారు.

ముఖ్యమంత్రికి వినతులు

పుట్టపర్తిరూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పలువురు వినతులు సమర్పించారు.

జిల్లా యూనిట్‌గా వర్గీకరణ చేయాలి



రాష్ట్ర ప్రాతిపదికన ఎస్సీ వర్గీకరణ చేయడం ద్వారా ఉమ్మడి జిల్లాలోని సరైన న్యాయం జరగలేదు. జిల్లా యూనిట్‌గా వర్గీకరణ చేసి, మాదిగలకు న్యాయం చేయాలి.

- బేకరీ గంగాధర్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్

బలిజలను బీసీ జాబితాలో చేర్చండి

యువగళం రథసారథి నారా లోకేశ్ బలిజలను బీసీ జాబితాలో చేరుస్తామని హామీ ఇచ్చారనీ, ఆ మేరకు రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేయాలి. కాపు కార్పొరేషన్ ద్వారా విదేశీ విద్యారుణాలు అందజేయాలి. గ్రూప్ 1, గ్రూప్ 2 పరీక్షలకు శిక్షణాకేంద్రాలు ఏర్పాటు చేయాలి.

- చింతా దామోదర్, రాయలసీమ బలిజ సంఘం ఉపాధ్యక్షుడు

ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు చేయూతనివ్వండి



కొత్త జిల్లాలో ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు చేయూతనిందించాలనీ, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల పట్టాల ఇచ్చి, గృహ నిర్మాణాలకు అవకాశం కల్పించాలి. సీనియర్ జర్నలిస్టులకు పింఛన్ అందజేయాలి. **- జర్నలిస్టు సంఘాలు**

వడ్డెర్లకు న్యాయం చేయండి



వడ్డెర కులస్తులకు న్యాయం చేయాలి. గత ఐదేళ్లలో వడ్డెర్లకు అన్యాయం చేశారు. విద్య, ఉపాధి, సామాజిక, సంక్షేమ రంగాల్లో వివక్ష చూపారు. వడ్డెర్ల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు అమలు చేయాలి. కార్పొరేషన్ పదవులు ఇచ్చి, న్యాయం చేయాలి.

- సిమెంట్ పోలన్న, వడ్డెర సంక్షేమ సంఘం నేత



సత్యసాయి మహా సమాధిపై పూలమాల వేస్తున్న సీఎం చంద్రబాబు

మహాసమాధిని దర్శించుకున్న సీఎం

పుట్టపర్తి రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ గురువారం శ్రీసత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. వారితోపాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కూడా ఉన్నారు. గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రశాంతి నిలయంలో శ్రీసత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ నవంబరులో నిర్వహించే శ్రీసత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల కార్యక్రమాలను ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి నేరుగా సత్యసాయి ఎయిర్‌పోర్టుకు చేరుకుని ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరి వెళ్లారు.



సత్యసాయి మహా సమాధికి మంత్రి నారా లోకేశ్ ప్రణామం

24 గంటలు.. 70వేల చదరపు మీటర్లు..



హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ లైనింగ్ పనులు

హంద్రీనీవా లైనింగ్ పనుల్లో రికార్డు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సుజల స్రవంతి పథకం సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులు జెట్‌స్పీడ్‌తో చేస్తున్నారు. 24 గంటల్లో 70వేల చదరపు మీటర్ల సిమెంట్ కాంక్రీట్ పనులు పూర్తి చేసేందుకు ఇంజనీర్లు పనులు ప్రారంభించారు. శ్రీసత్యసాయి జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసిన హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ఎస్ఈ రాజాస్వరూప్.. రికార్డు సృష్టించే సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనుల గురించి వివరించారు. దీంతో సీఎం అభినందించారని ఎస్ఈ తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్యాకేజీ నంబర్-1 నుంచి 7వ ప్యాకేజీ వరకు 216.3 కిలోమీటరు నుంచి 400.5 కిలోమీటరు వరకు ఆయా ప్రాంతాలతోపాటు పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌లో 7వేల క్యూబిక్ మీటర్ల స్టీల్ ఫైబర్ రెయిన్ హర్స్‌మెంట్ కాంక్రీట్‌తో 70వేల చదరపు మీటర్ల లైనింగ్ పనులు గురువారం ఉదయం 8 గంటలకు చేపట్టినట్లు ఎస్ఈ తెలిపారు. శుక్రవారం ఉదయానికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అత్యాధునిక సాంకేతిక సహాయంతో భారీ యంత్రాలు, అధిక సంఖ్యలో కార్మికులు, ఇంజనీర్లను భాగస్వాములు చేసి ఈ రికార్డు సాధించబోతున్నామని తెలిపారు.



లైనింగ్ పనుల్లో అత్యాధునిక పరికరం

ఎప్పుడూ ఇంతేనా..?

(5వ పేజీ తరువాయి)

ఎంపీఈఓలు నిర్వర్తిస్తున్నారు. అయినా రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమానంగా వేతనం ఇవ్వడం లేదు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రం సిబ్బంది నెలకు రూ.34వేల వేతనం పొందుతున్నారు. ఎంపీఈఓలకు నెలకు రూ.12వేలతోపాటు ప్రోత్సాహక రుసుం రూ.3వేలు అందిస్తున్నారు. ఎంపీఈఓల పనితీరు బాగుందని వ్యవసాయ అధికారి నిర్ధారించి సర్టిఫికెట్ ఇస్తేనే రూ.3వేలు ప్రోత్సాహక రుసుం అందిస్తారు. లేదంటే ఆ సొమ్ము రాదు. రైతు సేవా కేంద్రం సిబ్బందికి సమానంగా పనులు చేస్తున్న తమకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఎంపీఈఓల సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సమాన వేతనం ఇవ్వాలి



రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమానంగా ఎంపీఈఓలు పని చేస్తున్నారు. వారికి నెలకు అన్ని రకాల అలవెన్స్‌లు కలిపి రూ.34వేల వేతనం ఇస్తున్నారు. గత పదేళ్లుగా కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న ఎంపీఈఓలకు నెలకు రూ.12వేలతోపాటు రూ.3వేలు ప్రోత్సాహక రుసుం ఇస్తున్నారు. మినిమమ్ టైం స్కేల్ వర్తింజేసి, సమాన పనికి సమాన వేతనం అందించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని ఎంపీఈఓలను ఆదుకోవాలి. సీఎం చంద్రబాబు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడులు ప్రత్యేక చొరవ తీసుకొని ఎంపీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు చేపట్టాలి.

- రెడ్డి ప్రసాద్, ఎంపీఈఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సకాలంలో రెన్యువల్ చేయాలి



గత ప్రభుత్వ హయాంలో నాలుగు నెలలు ఆలస్యంగా రెన్యువల్ జీవో జారీ చేస్తూ వచ్చారు. దీంతో ఐదు నెలలపాటు వేతనాలు ఆలస్యంగా వచ్చేవి. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ రెన్యువల్ జీవో జారీ చేయడంలో జాప్యం జరుగుతోంది. గత నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో బయట వ్యక్తులతో అప్పులు తెచ్చుకొని కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తోంది. ఇప్పటి నుంచైనా సకాలంలో రెన్యువల్ జీవో జారీ చేసి, ప్రతి నెలా వేతనం అందించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. **- తిరుపతయ్య, ఎంపీఈఓల సంఘం జిల్లా కార్యదర్శి**

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

- విద్యార్థులు కష్టపడి చదవాలి
- మంత్రి పయ్యావుల కేశవ్
- ఉరవకొండలో మెగా పీటీఎంకి హాజరు



విద్యార్థులతో సెల్ఫీ తీసుకుంటున్న మంత్రి

ఉరవకొండ, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన మెగా పీటీఎం కార్యక్రమానికి మంత్రితోపాటు కలెక్టర్ వినోద్ కుమార్ హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ.. ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రూ.94వేలు ఖర్చు చేస్తోందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి, బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. మెగా పీటీఎం గిన్నిస్ బుక్ రికార్డుల్లో చోటు దక్కించుకునే అవకాశం ఉందన్నారు. గ్రీన్‌పాస్‌పోర్టు ద్వారా విద్యార్థులు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి తిప్పేనాయక్, తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీవో రవిప్రసాద్, ఎంఈవోలు ఈశ్వరయ్య, రమాదేవి, ప్రిన్సిపాళ్లు కృష్ణమూర్తి షాషావలి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చిత్తూరు చిత్తు

నాలుగో రౌండ్ మల్టీ డే క్రికెట్ పోటీలు ప్రారంభం



ఆంజనేయులు



రేవంత్‌రెడ్డి



అరుణ్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): నెల్లూరు బౌలర్ల ధాటికి చిత్తూరు చిత్తయింది. నాలుగోరౌండ్ సీనియర్ మల్టీ డే క్రికెట్ పోటీలు గురువారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో ప్రారంభమయ్యాయి. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో అనంతపురం, కర్నూలు జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో అనంతపురం 54 ఓవర్లలో 267 పరుగులకు ఆలౌటైంది. గిరినాథ్‌రెడ్డి (64), వినయ్‌కుమార్ (38), కమిల్ (28), దత్తారెడ్డి (25) ఫర్వాలేదనిపించారు. కర్నూలు బౌలర్లు ఆంజనేయులు 4, ఖానీష్ 2 వికెట్లు తీశారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 34 ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 194 పరుగులు చేసింది. అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో చిత్తూరు, నెల్లూరు జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు 23.3 ఓవర్లలో 124 పరుగులకు ఆలౌటైంది. నెల్లూరు బౌలర్లు అరుణ్ 5, అఖిల్ 4 వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు 45 ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 215 పరుగులు చేసింది. రేవంత్‌రెడ్డి సెంచరీ (123బంతుల్లో 10బౌండరీలు, రెండు సిక్సర్లతో 111)తో చెలరేగగా.. సుబ్రహ్మణ్యం హాఫ్ సెంచరీ (74)తో ఆకట్టుకున్నాడు.

ప్రేమ, శాంతికి కేంద్రం.. ప్రశాంతి నిలయం

- కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్
- ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



బాబా మహాసమాధిపై పూలమాల వేస్తున్న కేంద్రమంత్రి

పుట్టపర్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రేమకు, శాంతికి కేంద్రంగా ప్రశాంతి నిలయం నిలుస్తోందని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కొనియాడారు. ప్రశాంతి నిలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొదట సత్యసాయి మహాసమాధిని అలంకరించి పూజలు చేశారు. విద్యార్థుల గురువందనం పేరిట భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం కేంద్రమంత్రి ప్రసంగించారు. సత్యసాయి తన ప్రేమ, సేవ, ఆధ్యాత్మిక బోధనలతో ఎందరికో గురువుగా మారి, పూజింపబడుతున్నారన్నారు. సత్యసాయిబాబా వెలకట్టలేని సేవలను ప్రజలకు అందించారన్నారు. సత్యసాయి శివైక్యం తరువాత ట్రస్టు కొనసాగిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సత్యసాయి సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే సత్యసాయి ప్రేమ తత్వం, సేవాసంస్థలు నిర్వహిస్తున్న సేవల గురించి వివరించారు. కేంద్రమంత్రితోపాటు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ సేవాసంస్థలు ఏర్పాటు చేసిన క్రిమిసంహారక మందుల పిచికారీ యంత్రాలను 200 మంది రైతులకు పంపిణీ చేశారు. ట్రస్టు సభ్యులతో కలిసి మొక్కలను నాటారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జేరత్నాకర్, మంత్రి సత్యకుమార్‌లు కేంద్రమంత్రిని ఘనంగా సత్కరించారు. సాయంత్రం ప్రముఖ గాయకుడు హరిహరన్‌బృందం సంగీత గాన కచేరి నిర్వహించింది. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్టుసభ్యులు చక్రవర్తి, నాగానందం, డాక్టర్ మోహన్, మాజీ మంత్రి గీతారెడ్డి, ఇటలీ ప్రతినిధి హీరా, వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

దాడి కేసులో 21 మంది అరెస్ట్



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రాయదుర్గం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలాపురం, కొళగానహళ్లి గ్రామాల మధ్య జరిగిన దాడి, ప్రతిదాడి ఘటనలో గురువారం 21 మందిని అరెస్ట్ చేసినట్లు బొమ్మనహాళ్ ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. రాయదుర్గం సర్కిల్ కార్యాలయం వద్ద గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మైలాపురం గ్రామానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో కొళగానహళ్లి గ్రామానికి చెందిన అనంతరాజు అనే వ్యక్తిపై దాడి జరిగిందన్నారు. ఇది రెండు గ్రామాల మధ్య వివాదంగా మారింది. ఈక్రమంలో రెండు గ్రామాల ప్రజలు మూకుమ్మడిగా దాడులు చేసుకున్నారు. దీంతో ఐదుగురు గాయపడ్డారు. పశువుల మేతను దహనం చేశారు. కారు, రెండు మోటారు వాహనాలను ధ్వంసం చేశారు. ఇళ్లల్లో చొరబడి టీవీలు, ఫర్నిచర్‌లు ధ్వంసం చేశారు. ఈ ఘటనలకు బాధ్యులుగా భావిస్తూ కొళగానహళ్లి గ్రామానికి చెందిన 21 మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచనట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. దాడిలో పాల్గొన్న మైలాపురం గ్రామానికి చెందిన మరో వర్గం వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, వారు డిశ్చార్జ్ కాగానే అరెస్టు చేస్తామన్నారు.

సార్..! నేను సచ్చిపోతా..!

- పోలీస్ యంత్రాంగానికి యువకుడి సెల్ఫీ వీడియో

గుత్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రజాపురం గ్రామానికి చెందిన నామాల నారాయణస్వామి తాను ఆత్మహత్య చేసుకుంటానంటూ రైల్వే ట్రాక్‌పై నిలబడి ఓ సెల్ఫీ వీడియో తీసి జిల్లా పోలీస్ యంత్రాంగానికి పంపాడు. ఉలిక్కిపడిన పోలీసులు సమాచారాన్ని గుత్తి పోలీసులకు అందజేశారు. పోలీస్ బృందాలు అతడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. అయితే ఆ వ్యక్తి తన సెల్‌ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేయడంతో వెతకడానికి పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. నారాయణస్వామి ఈసురాళ్లపల్లి గ్రామానికి చెందిన ఓ యువతితో గతం లో ప్రేమాయణం నడిపాడు. మోసం చేయడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. దీంతో నారాయణస్వామిపై కేసు నమోదు చేసి జైలుకు పంపారు. తిరిగి వచ్చిన అతడు నమ్మించి గత నెలలో ప్రియురాలిని వివాహం చేసుకున్నాడు. ఆమెతో కలిసి అనంతపురంలో కాపురం పెట్టాడు. తర్వాత తన సొంతూరు రజాపురం గ్రామానికి ఆమెను తీసుకువచ్చాడు. నారాయణస్వామి కుటుంబికులు ఆ యువతితో గొడవ పడ్డారు. వ్యవహారం పోలీస్‌స్టేషన్‌కు చేరడంతో పోలీసులు వారికి రెండు రోజుల కిందట కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. అయితే ఆ యువతిని వదిలించుకోవాలన్న నేపంతో నారాయణస్వామి ఈ నాటకీయ పరిణామాలకు తెరలేపినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆత్మహత్య చేసుకుంటానని పోలీసులకు సమాచారం ఇచ్చి అదృశ్యం కావడంతో అతడి కోసం రైల్వేట్రాక్ వెంట పోలీసులు గాలింపు చేపట్టారు. ఇప్పటిదాక అతడి ఆచూకీ తెలియలేదు.

హాస్టల్ రీ మోడల్..!

- రూపురేఖలు మారిన గడేకల్లు వసతి గృహం
- అధ్వానం నుంచి అద్భుతమైన సౌకర్యాలు
- మంత్రి కేశవ్ చొరవతో బాగుపడిన బాలుర హాస్టల్

విడపనకల్లు, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేకల్లు ఎస్సీ బాలుర హాస్టల్ రూపు రేఖలు మారాయి. గత ఏడాది ఆగస్టులో ఈ ఎస్సీ బాలుర హాస్టల్‌కు చెందిన విద్యార్థులు ఇక్కడ ఉండలేము అంటూ ఆందోళన చేపట్టారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి దిన పత్రికలో గత ఏడాది ఆగస్టు 17న ఇక్కడ ఉండలేము అంటూ ప్రత్యేక కథనం ప్రచురితం చేసింది. దీనికి స్పందించిన టీడీపీ నాయకులు విషయాన్ని మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి హాస్టల్ రీ మోడలింగ్‌కు రూ. 13.5లక్షలు ప్రత్యేక నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టేలా చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యే సమయానికి హాస్టల్‌ను రెడీ చేయించారు. మరుగు దొడ్లు, ట్రీ బెంచ్‌లు, హాస్టల్ గదుల్లో ఫ్యాన్లు, కిటికీలు, విద్యార్థులకు కొత్త పెట్టెలు, తాగు నీటి ట్యాంక్‌లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు కొళాయిలు, డ్రైనేజీలు, ఏర్పాటు చేయించారు. హాస్టల్ చుట్టూ పరిసరాలను సైతం శుభ్రం చేయించారు. హాస్టల్ రూపురేఖలు మారడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రూపురేఖలు మారిన ఎస్సీ హాస్టల్



విద్యార్థులు చదువుకునేందుకు చెట్ల వద్ద ఏర్పాటు చేసిన అరుగులు

భయంగా ఉండేది



గత ఏడాది ఇక్కడ హాస్టల్‌లో ఉండాలంటే భయంగా ఉండేది. హాస్టల్ మొత్తం అధ్వానంగా ఉండేది. గత ఏడాది విద్యార్థులు అందరూ కలిసి జిల్లా అధికారులు దృష్టికి హాస్టల్ పరిస్థితిని తీసుకెళ్లాం. అధికారులు స్పందించి మా హాస్టల్ రూపు రేఖలు మార్చేశారు. ఇప్పుడు మాకు ఎటువంటి ఇబ్బంది లేదు. చాలా బాగుంది.
-సాయి దర్శన్, 8వ తరగతి

సౌకర్యాలు బాగున్నాయి



గతంలో మాకు హాస్టల్‌లో సౌకర్యాలు చాలా అధ్వానంగా ఉండేవి. ప్రస్తుతం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. రంగులు వేసి హాస్టల్ భవనాన్ని కొత్తదానిగా తీర్చిదిద్దారు. శిథిలమైన పాత భవనాన్ని తొలగించి హాస్టల్ ప్రాంగణంలో విద్యార్థులు చదువుకునేందుకు ఏర్పాట్లు చేశారు. సన్నబియ్యంతో చేసిన భోజనం పెడుతున్నారు. హాస్టల్‌లో అన్ని సౌకర్యాలు చాలా బాగున్నాయి. -పీబీ ప్రభాస్, పదో తరగతి

సీమ కరువును శాశ్వతంగా తరిమేద్దాం

(5వ పేజీ తరువాయి)

ఉద్దేశ్యమన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు కలిసికట్టుగా ఆలోచించి, కరువు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో కేంద్రానికి నివేదికలు ఇవ్వాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, ఎక్కడ లోపాలున్నాయో గుర్తించి, పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు, సెరికల్చర్ కమిషనర్ శ్రీనివాసులు, రాయలసీమ జిల్లాలో కరువు పరిస్థితి, వివిధ పంటల సాగువివరాలు, ఇరిగేషన్ అంశాల గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా తెలిపారు. బుందేల్‌ఖండ్ రీజియన్ మాదిరిగా రాయలసీమ జిల్లాలకు ఆర్థికసాయం ప్రకటించాలని, సీమాభివృద్ధికి సహకారమందించాలని కోరారు. సమావేశంలో రాయలసీమజిల్లా వ్యవసాయ, ఉద్యాన, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతులే దేశానికి బలం

రైతులే దేశానికి బలమని, వారి అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని కేంద్రమంత్రి పేర్కొన్నారు. మండలంలోని పెడబల్లిలో సేంద్రియ పద్ధతిలో సాగుచేసిన మిశ్రమ పంటను కేంద్రమంత్రి గురువారం పరిశీలించారు. వర్షాభావం వల్ల ఎండిన పంటలపై ఏర్పాటు చేసిన ఛాయచిత్ర ప్రదర్శన తిలకించారు. అనంతరం పెడబల్లి గ్రామ పొలాల రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలతో ముఖాముఖి మాట్లాడారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో రైతుల పాత్ర కీలకమైనదన్నారు. మహిళలు పేదరికాన్ని జయించి, ఆత్మగౌరవంతో జీవించాలన్నారు. శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్ సూచించిన విధానంలో రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేయడం శుభసూచకమన్నారు. అనంతరం శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలకు చెందిన 53,746 ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రూ.437.9కోట్ల బ్యాంక్ లింకేజీ చెక్కును కేంద్రమంత్రి అందించారు. అంతకుముందు ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఏర్పాటు చేసిన ఉత్పత్తుల స్టాల్స్‌ను కేంద్ర మంత్రి పరిశీలించి, వారిని అభినందించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, రైతు సంక్షేమ శాఖ జాతీయ జాయింట్ సెకటరీ పెర్నిదేవి, రాష్ట్ర సెర్ప్ సీఈఓ కరుణ, రాష్ట్ర అగ్రికల్చర్, మార్కెటింగ్ సహకార సంఘం చైర్మన్ విజయ్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్యపాల్గొన్నారు.



రైతాంగ సమస్యలపై కేంద్రమంత్రితో చర్చిస్తున్న సీఎం

కేంద్రమంత్రి దృష్టికి మామిడి రైతుల సమస్యలు

పుట్టపర్తి రూరల్: రాష్ట్రంలోని మామిడి రైతుల సమస్యలను కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి సీఎం చంద్రబాబు తీసుకెళ్లారు. రైతులను ఆదుకునేందుకు కేంద్రం తరఫున తగు సాయం చేయాలని కోరారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో కేంద్ర మంత్రిని సీఎం చంద్రబాబు గురువారం కలిశారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ధర్మవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): చిగిచెర్ల-ధర్మవరం రైల్వేస్టేషన్ల మధ్య గురువారం గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మరణించాడు. ధర్మవరం జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 20 నుంచి 30 సంవత్సరాల వయసుగల వ్యక్తి రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందాడు. మృతుడి ఒంటిపై లేతనీలిరంగు టీషర్ట్, నలుపురంగు చొక్కా, ఎడమ చేతిపై నేహ అనే పచ్చబొట్టు ఉందని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440557054, 9951325345 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కళాభివందనం

- పద్మశ్రీ చలపతిరావుకు మంత్రి పాదాభివందనం
- తోలుబొమ్మల కళకు జీవం పోశారంటూ ప్రశంసలు

ధర్మవరం రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ అవార్డు గ్రహీత, తోలుబొమ్మల కళాకారుడు దళవాయి చలపతిరావుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాదాభివందనం చేశారు. ప్రాచీన తోలుబొమ్మల కళకు జీవం పోశారని కొనియాడారు. బీజేపీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం మండలంలోని నిమ్మలకుంట గ్రామంలో పర్యటించారు. తోలుబొమ్మల కళలో పేరొందని పద్మశ్రీ అవార్డు గ్రహీత దళవాయి చలపతిరావు ఇంటికి వెళ్లి ఆయనను శాలువాకప్పి, పూలమాలతో సత్కరించారు. దళవాయి చలపతిరావు సాధించిన అవార్డులను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ.. దళవాయి చలపతిరావు కళాకారుడు మాత్రమే కారనీ, భారతీయ సంస్కృతికి వారసుడన్నారు. ఆయన వంటివారు ఈ ప్రాంతంలో ఉండటం అం దరికీ గర్వకారణమన్నారు. అలాంటి కళలు, కళాకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్, నాయకులు ఓబులేసు, శ్యామ్‌రావు, గోనుగుంట్ల భూషణ్ పాల్గొన్నారు.



చలపతిరావుకు పాదాభివందనం చేస్తున్న మంత్రి

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

అమరాపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బుధవారం రాత్రి తేనెపట్టు తీసే ప్రయత్నంలో విద్యుదాఘాతంతో తిప్పేష్ (35) మరణించాడు. పోలీసు స్టేషన్ వెనుక ఉన్న కాలనీలో చింతచెట్టులో ఉన్న తేనెపట్టును బుధవారం రాత్రి 8గంటల సమయంలో తిప్పేష్ ఇనుప కడ్డీతో తీసేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు ఇనుప కడ్డీ విద్యుత్ వైర్లను తాకడంతో షాక్ తగిలి, తిప్పేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. అతడితోపాటు దాసరి గిరీష్, దాసరి మంజునాథ్ కూడా గాయపడినట్లు సమాచారం. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన పన్నుల శాఖ జేసీ, డీసీ

అనంతపురం కలెక్టరేట్, జూలై 10(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నులశాఖ జిల్లా జాయింట్ కమిషనర్(జేసీ)గా ఇందుకూరి హేమ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ జేసీగా పనిచేస్తున్న శేషాద్రిని విజయవాడ-1 సర్కిల్‌కు బదిలీ చేసి, విజయవాడ-3 సర్కిల్‌లో పనిచేస్తున్న హేమను ఇక్కడకు నియమించారు. డిప్యూటీ కమిషనర్‌గా భాస్కరవల్లి పెనుముళ బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ పనిచేస్తున్న మురళీమనోహర్‌ను కర్నూలుకు బదిలీ చేశారు. విజయనగరంలో పనిచేస్తున్న భాస్కరవల్లి పెనుముళను జిల్లాకు నియమించారు.

డిప్యూటీ ఎంపీడీఓలు..

అనంతపురం న్యూటౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందిన వారు గురువారం బాధ్యతలు చేపట్టారు. డీపీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న లీలాబాయి కంబదూరు డిప్యూటీ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. ధర్మవరం డీఎల్‌పీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న విజయ్‌కుమార్ శింగనమల డిప్యూటీ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిసింది. అశ్వత్థనాయుడుకు ఇంకా ప్లేస్‌మెంట్ కేటాయించాల్సి ఉంది.

- గండిచెరువు నిండితే రైతులకు ఇబ్బందులే
- సోమయాజులపల్లి, వేపలకుంట రైతులకు దారి సమస్య
- దిగుబడిని పొలాల్లో వదిలేయాల్సిందే
- పట్టించుకోని పాలకులు, అధికారులు

మాగోడు ఎవరూ పట్టించుకోరు



గండిచెరువుకు అటు వైపు మాకు వ్యవసాయ భూమి ఉంది. మేము పండించిన పంటలను చెరువు నిండితే తీసుకురావడానికి నానా కష్టాలు పడాల్సి వస్తోంది. పలుమార్లు మా సమస్యను అధికారులకు తెలిపినా పట్టించుకోలేదు. రైతుల గోడు పట్టించుకునే నాయకులే లేకుండాపోయారు. - రాజారెడ్డి, రైతు, వేపలకుంట

నిండుకుండలా గండిచెరువు (ఫైల్)



గుండె చెరువు!

గాండ్లపెంట, జూలై 10(ఆంధ్రజ్యోతి): సాధారణంగా చెరువు నిండితే రైతులకు సంతోషం కలుగుతుంది. కానీ రెండు గ్రామాల రైతులకు మాత్రం ఇబ్బంది కలుగుతోంది. మండలంలోని వేపలకుంట గ్రామానికి ఆనుకుని ఉన్న గండిచెరువు నిండితే పొలాలకు వెళ్లడానికి దారి లేకుండాపోతోందని సోమయాజులపల్లి, వేపలకుంట రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయనగర రాజుల కాలంలో నిర్మించిన గండి చెరువుకు దాదాపు 15 సంవత్సరాల కిందట మరమ్మతులు చేశారు. దీంతో ఎగువ ప్రాంతాలైన మల్లమీదపల్లి, సామచేనుబైలు, ఎన్పీ కుంట మండలంలోని పలుగ్రామాల నుంచి వచ్చే వర్షపు నీరు ఈ చెరువుకు చేరి, నిల్వ ఉంటోంది. దీంతో గండిచెరువు దిగువన బోరు బావుల్లో నీరు పుష్కలంగా లభిస్తోంది. చెరువుకు అటువైపు సోమయాజులపల్లి, వేపలకుంట గ్రామాల రైతులకు చెందిన దాదాపు ఐదు వందల ఎకరాలకుపైగా భూములు ఉన్నాయి. వీటిని ఖరీఫ్, రబీలో సాగు చేస్తున్నారు. చెరువు నిండితే అవతల ఉన్న పొలాల నుంచి దిగుబడిని ఇంటికి చేర్చుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు అధికారులు, పాలకులకు చెప్పినా ప్రయోజనం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గండిచెరువుకు అటువైపు భూముల్లో వరినార్లు వేసుకుంటున్నారు. పంట కోత సమయలో చెరువు నిండితే తమ పరిస్థితి ఏమిటని వారు ఆందోళన చెందుతున్నారు.



గ్రాసం కోసం నీటిలోనే పశువులను తీసుకెళ్తున్న రైతులు (ఫైల్)

ప్రతిపాదనలు పంపాం

గండిచెరువు నిండితే అటువైపు భూములకు రహదారి లేక రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. రోడ్డు నిర్మాణం కోసం ప్రణాళికలు తయారు చేసి ఉన్నధికారులకు పంపాం. ఉత్తర్వులు, నిధులు మంజూరైన వెంటనే పనులు మొదలు పెడతాం.
-అరుణకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

చెరువు నిండితే పంటను వదిలేయాల్సిందే

సోమయాజులపల్లి, వేపలకుంట, గ్రామాల రైతులకు గండిచెరువు అటువైపున భూములున్నాయి. చెరువుకు మరమ్మతులు చేపట్టక ముందు వేపలకుంట సమీపంలో రస్తా సౌకర్యం ఉండేది. రైతులు సాగుచేసిన పంటలను, పశుగ్రాసం, పశువులను తీసుకొచ్చేందుకు వీలుండేంది. ప్రస్తుతం చెరువు నిండితే పొలాలకెళ్లే దారి మొత్తం నీటితో మునిగిపోతోంది. దీంతో రైతుల రాకపోలకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. చెరువు నిండితే పంటను వదిలేయాల్సిందే అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు అటువైపు వివిధరకాల పంటలు, మామిడితోటలు, కూరగాయా లు తదితరవాటిని సాగుచేస్తారు. ఆగ్రామాల్లో పాడి పశువులు అధికంగా ఉ న్నాయి. గ్రాసాన్ని చెరువు అటువైపు భూములనుంచి తెచ్చుకోవాల్సిందే. వర్షాకాలంలో నీటిలో వెళ్తూ గడ్డి మోపులు మోసుకుని రావాల్సి వస్తోంది. అలాగే పశువులను మేతకు తీసుకెళ్లాలంటే చెరువులోనే వెళ్లాల్సి వస్తోంది.

ఎగువ ప్రాంతంలో రస్తా ఏర్పాటు

గండిచెరువు ఎగువప్రాంతంలో కొంతమంది రైతులు సొంతంగా రూ. లక్షలు ఖర్చు చేసి రస్తా ఏర్పాటు చేసుకున్నారు. గత పదేళ్లుగా రస్తా లేకపోవడంతో చేతికొచ్చిన పంటలను వదిలేయాల్సి దుస్థితి నెలకొంది. ప్రభుత్వం, పాలకులు పట్టించుకోకపోవడంతో సోమయాజులపల్లికి చెందిన జయరాం, కొండయ్య, చంద్ర తదితర రైతులు కలిసి సొంతంగా దాదాపు రూ.3లక్షలు ఖర్చు చేసి మరువ సమీపం నుంచి చెరువు కట్టమీదుగా రస్తా ఏర్పాటు చేసుకున్నారు. అయితే దిగువప్రాంత రైతుల ఈ రస్తాలో వెళ్లడానికి వీలు కాదు.

నకిలీ బంగారం ముఠా అరెస్టు

- హాల్ మార్క్ లేజర్ మిషన్ స్వాధీనం

గుంతకల్లుటౌన్, జూలై10(ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారు నగలు తయారు చేసే ముఠాను కసాపురం పోలీసులు అరెస్టు చేశారు. 9 మందిని అరెస్టు చేసి, వారి నుంచి 39 గ్రాముల బంగారు గాజులు, 13 నకిలీ బంగారు ఉంగరాలు, రూ.లక్ష నగదు, హాల్ మార్క్ వేసే మిషన్, 200 గ్రాముల నాలుగువెండి కాలి పట్టీలు, 15గ్రాముల వెండి కడియం, 145 గ్రాముల కాపర్ తీగలు, వేయింగ్ మిషన్ స్వాధీనం చేసుకున్నారు. కసాపురం పోలీసు స్టేషన్‌లో గురువారం సాయంత్రం రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ టీపీ వెంకటస్వామితో కలిసి ట్రైనీ డీఎస్పీ అష్రఫ్ అలీ.. ముఠా అరెస్టు వివరాలను వెల్లడించారు. పట్టణానికి చెందిన భార్గవకుమార్, శివానంద ఈనెల 8వ తేదీన పట్టణంలోని కరూర్ వైశ్యాబ్యాంకులో నాలుగు బంగారు నకిలీ గాజులను తాకట్టు పెట్టేందుకు వెళ్లారు. పరీక్షించిన బ్యాంకు సిబ్బంది నకిలీ బంగారు తెచ్చారని నిలదీశారు. తమకు వేరేవాళ్లు ఇచ్చారంటూ వారు అక్కడి నుంచి జారుకున్నారు. ఈ విషయంపై బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ వెంకట్ రెడ్డి బుధవారం కసాపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కసాపురం రోడ్డులోని ఎస్‌బీఐ బ్యాంకు వద్ద ఉన్న నిందితులను పట్టుకున్నారు. పట్టణంలో బంగారు షాపు నిర్వహిస్తున్న క్రాంతి, వేణుగోపాల్ సాయంతో నకిలీ బంగారు ఆభరణాలు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. లేజర్ మిషన్‌తో 30టచ్ గోల్డ్ తయారు చేసి, విక్రయించడం, తాకట్టు పెట్టడం చేస్తున్నారు. సాధారణ ప్రజలు గుర్తించలేకుండా వాటిపై హాల్ మార్క్ కూడా వేస్తున్నారు. పట్టణానికి చెందిన భార్గవ్‌కుమార్, క్రాంతి, వేణుగోపాల్, శివానంద, ఎరుకల శ్రీనివాసులు, నరేంద్ర, మహమ్మద్ జావేద్, కర్నూలు నగర వాసులు మేకల శ్రీనివాసులు, మల్లెమాల నరేష్ అరెస్టయిన వారిలో ఉన్నారు.



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న ట్రైనీ డీఎస్పీ


రాప్తాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థినికి బహుమతి అందిస్తున్న జేసీ శివనారాయణ శర్మ


బీకేఎస్ మండలం సిద్ధరాంపురం జడ్పీ హైస్కూల్లో విద్యార్థినికి యూనిఫాం పంపిణీ చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి

మెగా పీటీఎం విజయవంతం

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో గురువారం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ (మెగా పీటీఎం) విజయవంతమైంది. అనంతపురం అర్బన్, రాప్తాడు, శింగనమల నియోజకవర్గాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల్లో ఈ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించారు. ప్రతిపాఠశాలలోనూ విద్యార్థులు తల్లిదండ్రులకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, నాయకులకు,ఎస్ఎంసీ చైర్మన్లకు గులాబీ పువ్వులు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు విద్యార్థులతో మమేకమై పలు ఆటల పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థులు తమ తల్లులకు పాదపూజ చేశారు. తర్వాత సమావేశాలు ఏర్పాటు చేసి పాఠశాలల్లో వసతులు, విద్యాప్రమాణాలు, మధ్యాహ్నభోజనం తదితర అంశాలపై చర్చించారు. అలాగే అందరూ సహపంక్తి భోజనాలు చేశారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన షూలు, బ్యాగులు, యూనిఫాంను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

బుక్కరాయసముద్రం మండలం సిద్ధరాంపురం జెడ్పీ హైస్కూల్లో జరిగిన మెగా పీటీఎంలో టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాఠశాలలో విద్యార్థుల రక్షణ కోసం తన సొంత డబ్బురూ.40వేల వ్యయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. గార్లదిన్నెలోని కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ విశాలాక్షి హాజరయ్యారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థుల తల్లులకు బహుమతులు అందజేశారు. అనంతపురంరూరల్ మండలం రుద్రంపేట జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకుడు కుమార్‌నాయుడు విద్యార్థులకు క్రీడా దుస్తులు వితరణ చేశారు. కురుగుంట గురుకుల పాఠశాలలో డీఎస్పీ మల్లికార్జున, నార్పలలోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో జిల్లా బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ కుష్బూ కొఠారి, రాప్తాడు ఉన్నత పాఠశాలలో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.


గార్లదిన్నె కేజీబీవీలో విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాసరెడ్డి


శింగనమల మండలం సోదనపల్లి పాఠశాలలో తల్లులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు


ద్వారకానగర్ నారాయణ స్కూల్లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఏజీఎం రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ అస్మాఖాన్


టీడీపీ నాయకుడు కుమార్‌నాయుడు అందించిన క్రీడాదుస్తుల్లో రుద్రంపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు


ఆత్మకూరు జడ్పీ హైస్కూల్లో విద్యార్థుల తల్లులకు బహుమతులు అందజేస్తున్న టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

అనంతపురం క్రైం, జూలై10(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న 8 మందిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంలోని గౌరీ థియేటర్ సమీపంలో గల ఓ బిల్డింగ్‌లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందడంతో మూడు రోజుల కిందట వన్‌టౌన్ పోలీసులు, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు మూకుమ్మడిగా దాడులు చేశారు. అందులో ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1.49 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేశారు. అయితే ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

టీడీపీ నాయకులకు పరామర్శ

బుక్కరాయసముద్రం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నంపల్లిలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడి అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తలను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఏడీసీసీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి గురువారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం జరిగిన సంఘటనపై పోలీసులనడిగి తెలుసుకుని దాడి చేసిన వైసీపీ వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. మండల కన్వీనర్ అశోక్, మల్లిఖార్జున రెడ్డి, ఎస్.నారాయణస్వామి, లక్ష్మినారాయణ, కేశన్న తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో 16 మందిపై కేసు

బుక్కరాయసముద్రం, జూలై10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నంపల్లిలో బుధవారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ కేసులో 16 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పుల్లన్న తెలిపారు. వైసీపీకి చెందిన మనోహర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి లక్ష్మిరెడ్డి, హనుమంతురెడ్డిపై కేసు నమోదు చేశారు. టీడీపీకి చెందిన మైసూరారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రాజారెడ్డి, ఫణిభూషణ్, సుధాకర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, జయరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

● విద్యార్థులు బాగా చదువుకోవాలి
● మెగా పీటీఎంలో ఎమ్మెల్యే పరిటాల సునీత

కనగానపల్లి, రామగిరి జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు బాటలు వేసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. కనగానపల్లి కేజీబీవీ, రామగిరి మోడల్‌స్కూల్‌లో గురువారం నిర్వహించిన మెగా పీటీఎంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థులు, వారి తల్లితండ్రులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు నాణ్యమైన పుస్తకాలు, దుస్తులు అందించడంతో పాటు సన్న బియ్యంతో భోజనాన్ని అందిస్తున్నామన్నారు. విద్యార్థుల తల్లితండ్రులు పాఠశాలల్లో జరిగే సమావేశాలకు హాజరై విద్యార్థులకు అందుతున్న వసతులు, చదువుపై శ్రద్ధ కనబరచాలన్నారు. పిల్లలు ఎంత వరకైనా చదువుకోవాలని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. రామగిరిలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి పలు ఆటల పోటీల్లో పాల్గొన్నారు.


రామగిరిలో తాడాట ఆడుతున్న ఎమ్మెల్యే

కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్‌చౌదరి, టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య, సర్పంచ్ అంకే పరిమళా రామక్రిష్ణ, ఎంపీటీసీ బిల్లే భాస్కర్, నాయకులు సుధాకర్, బాలయ్య, శ్రీనివాసులు, ముత్యాలప్ప, మారుతీప్రసాద్, నాగేష్‌నాయుడు, రామ్మూర్తినాయుడు ప్రిన్సిపాల్ సర్వేశ్వరి తదితరలు పాల్గొన్నారు.

కేజీబీవీ సిబ్బందిపై ఆగ్రహం

కేజీబీవీ సిబ్బందిపై ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. మెగా పీటీఎం కార్యక్రమానికి విద్యార్థుల తల్లితండ్రులు తక్కువగా హాజరు కావడంపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంపై అశ్రద్ధ కనబరిచారని మండిపడ్డారు. మరోసారి ఇలా జరిగితే ఉపేక్షించనని హెచ్చరించారు.

లోకేశ్ వినూత్న ఆలోచనలతోనే మెగా పీటీఎం

● వైసీపీ హయాంలో విద్యారంగం నాశనం
● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం క్రైం/అనంతపురం విద్య, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వినూత్న ఆలోచనలతోనే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) రూపుదిద్దుకుందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని కేఎస్ఆర్ జూనియర్ కాలేజీ, ఎస్కేడీ హైస్కూల్, నగరపాలక ఉన్నతపాఠశాల, న్యూటౌన్ జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన మెగా పీటీఎం కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. కేఎస్ఆర్‌లో విద్యార్థినుల చేత వారి తల్లులకు పాదాభివందనం చేయించారు. తర్వాత ఎస్కేడీలో మాట్లాడుతూ... గతంలో ప్రైవేట్ స్కూళ్లలో మాత్రమే పేరెంట్ టీచర్స్ మీటింగ్స్ నిర్వహించేవారన్నారు. అయితే మంత్రి లోకేష్ ఆలోచనల వల్ల అది ప్రభుత్వ స్కూళ్లలో నిర్వహించడం మంచి నిర్ణయం అన్నారు. గత వైసీపీ పాలనలో జగన్ విద్యారంగాన్ని సర్వనాశనం చేశారంటూ మండిపడ్డారు. లోకేష్ మంత్రి అయ్యాక కొత్త సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. అందుకే ఈ ఏడాది విద్యారంగానికి 3,180కోట్లను మంజూరు చేయించారన్నారు. సర్కారు బడిలోనే జేఈఈ, ఐఐటీ, నీట్ వంటి పోటీపరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారని అన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారన్నారు. ఎస్కేడీ టీచర్ల విజ్ఞప్తి మేరకు స్కూల్‌లోని ఆర్వో ప్లాంట్‌ను సొంత నిధులతో ఏర్పాటుచేయిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. తర్వాత న్యూటౌన్ కాలేజ్‌లో పాల్గొని విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ బాలస్వామి, నాయకులు గంగారామ్, పీఎల్ఎన్ మూర్తి, పరమేశ్వర్, కడియాల కొండన్న, సరిపూటి రమణ, గుర్రం నాగభూషణం, సాకే లక్ష్మీనరసింహ, సుధాకర్‌యాదవ్, ఫిరోజ్ అహ్మద్, మోహన్‌కుమార్, సాకే జయప్ప, నెట్టెం బాలకృష్ణ, వడ్డే భవానీ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

కాలక్షేపం చేస్తామంటే కుదరదు..

● మేనేజర్ల సమావేశంలో ఏడీసీసీ బ్యాంకు చైర్మన్


సమావేశంలో మాట్లాడుతున్న కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లు కాలక్షేపం చేశారు... ఇక నుంచి నిబద్ధతతో పని చేయాల్సిందేనని, నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి హెచ్చరించారు. స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్‌లో గురువారం ఆయన ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ల సమావేశం నిర్వహించారు. మొదట బ్రాంచ్‌ల వారిగా పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం, నాబార్డు, ఆప్కాబ్ నుంచి తమకు పూర్తి సహకారం ఉంటుందని.. కష్టపడి పని చేస్తే బ్యాంకును, సొసైటీలను అభివృద్ధిలో పరుగులు పెట్టించవచ్చని తెలిపారు. డిపాజిట్ల సేకరణ, రుణాల పంపిణీ, వసూళ్లు, ఎన్‌పీఏ తగ్గింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. 2025 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించి న లక్ష్యాల సాధనలో ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలని సూచించారు. అద్దె భవనాలకు సొంత భవనాలు నిర్మిస్తామని, కమర్షియల్ బ్యాంకులకు దీటుగా ఆధునీకరిస్తామని, అధునాతన సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి, ఆప్కాబ్ నోడల్ అధికారి సురేంద్ర, డీజీఎంలు రాంప్రసాద్, సుఖదేవబాబు, విజయచంద్రారెడ్డి, సీనియర్ అధికారులు, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో విద్యారంగం బలోపేతం


మాట్లాడుతున్న లక్ష్మీనరసింహులు

అనంతపురం క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ విశేషంగా కృషి చేస్తున్నారని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు పేర్కొన్నారు. పాతూరులోని నెంబర్ 2 స్కూల్లో గురువారం జరిగిన మెగా పీటీఎంలో అయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యా సామాగ్రి అందిస్తోందన్నారు. ఇప్పుడు వారి విద్యాప్రగతిని తెలుసుకునేందుకు టీచర్స్, పేరెంట్స్ మీటింగ్ నిర్వహించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఓంకార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్రం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): గత 11ఏళ్లుగా కేంద్రం కార్మికుల హక్కులను హరిస్తోందని భారత కార్మికసంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ విమర్శించారు. స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులో ఐఎఫ్‌టీయూ నగర సమితి కార్యాలయాన్ని గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లడుతూ.. కార్మికుల హక్కులను కేంద్రప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందనాన్నారు. ఇందుకు కేంద్రంపై పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, నగర అధ్యక్షుడు దావీద్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో గురుపూర్ణిమ

అనంతపురంరూరల్, జూలై10(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ అనుబంధ తైలసాంకేతిక, ఔషధ పరిశోధనా సంస్థలో గురువారం గురుపూర్ణిమను నిర్వహించారు. కార్యక్రమానికి సంస్థ సంచాలకులు ఆచార్య జీవీ సుబ్బారెడ్డి హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల బోధనలు విద్యార్థుల జీవితాన్ని సంపూర్ణంగా ప్రభావితం చేస్తాయన్నారు. తద్వారా ఉపాధ్యాయులు ఒక సౌభాగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడంలో ఎనలేని పాత్ర పోషిస్తారన్నారు. ప్రిన్సిపాల్ గోపీనాథ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లహరి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో..

అనంతపురం క్లాక్‌టవర్: స్థానిక బీజేపీ కార్యాలయం లో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసమహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ జిల్లాలోని పలువురు కళాకారులను, గురువులను సన్మానించారు. బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ప్రజాసంక్షేమం

● సుపరిపాలనకు తొలిఅడుగులో ఎమ్మెల్యే శ్రావణిశ్రీ


జూనియర్ కాలేజీలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

నార్పల, జూలై10(ఆంధ్రజ్యోతి): సీఎంచంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. మండలకేంద్రంలో గురువారం సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పాలనలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. ఆయనతోనే ప్రజా సంక్షేమం సాధ్యమన్నారు. తర్వాత స్థానిక జూనియర్ కళాశాలలో పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకులు ఆలం వెంకటనరసానాయుడు, ప్రతాప్‌చౌదరి, మాజీ ఎంపీపీ ఆకుల అరుణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఆకుల ఆంజనేయులు, మండల కన్వీనర్ ఎర్రనాగప్ప, సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్, ఈఓఆర్డీ శైలజరాణి పాల్గొన్నారు.

ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించడం సరికాదు

బుక్కరాయసముద్రం, జూలై10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించడం సరికాదని, అభివృద్ధి చేస్తే సహకరిస్తామని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీమంత్రి శైలజానాథ్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. చెన్నంపల్లిలో బుధవారం రాత్రి వైసీపీ కార్యకర్తలపై జరిగిన దాడిని ఖండించారు. కూటమి అధికారంలోకి వచ్చిన అనంతరం వైసీపీ కార్యకర్తలపై భౌతిక దాడులు అధికమయ్యాయన్నారు. అధికారంలో ఉన్నామని దాడులు చేయడం సరికాదన్నారు. దమ్మంటే అభివృద్ధిలో పోటీ పడాలన్నారు. నాయకుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, జడ్పీటీసీ భాస్కర్, సర్పంచ్ పార్వతి పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ ఎస్ఈగా మురళీకృష్ణ బాధ్యతలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): రోడ్లు భవనాల శాఖ జిల్లా ఎస్ఈగా మురళీకృష్ణ నియమితులయ్యారు. నెల్లూరు ఈఈగా ఉన్న ఆయన్ను ఎస్ఈగా పదోన్నతి కల్పిస్తూ ఇక్కడికి బదిలీ చేశారు. గురువారం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మురళీకృష్ణ స్థానిక అంబేడ్కర్‌రోడ్డులో ఉన్న ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు అనంతపురం డివిజన్ ఈఈ రాజగోపాల్ ఇంచార్జి ఎస్ఈగా వ్యవహరించారు.

చైన్‌స్నాచింగ్ ప్రాంతం పరిశీలన

నార్పల, జూలై 10(ఆంధ్రజ్యోతి):మండలంలోని బీ.పప్పూరుగ్రామంలో గత సోమవారం తెల్లవారుజామున మహిళ మెడలో చైన్‌స్నాచింగ్ జరిగిన ప్రాంతాన్ని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు గురువారం పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు.

రేపు ఆత్మీయ సమ్మేళనం

అనంతపురం వైద్యం, జూలై10(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగకు ఈనెల12న ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఎంఈఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్ గురువారం ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సీఎస్ఆర్ కల్యాణమండపంలో జరిగే కార్యక్రమానికి పెద్దఎత్తున ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారులు తరలిరావాలని కోరారు.

నేత్రపర్వంగా శ్రీనివాసుడి కల్యాణం

అనంతపురం టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం హెచ్చెల్సీ కాలనీలోని కొల్హాపూర్ మహాలక్ష్మి ఆలయంలో శ్రీనివాసుడి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక వేత్తలు మనూరు నాగరాజరావు, కణంపల్లి ఉమారాణి ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్రైం, జూలై 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర వ్యవసాయశాఖా మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ కలిశారు. గురువారం సాయంత్రం పుట్టపర్తి విమానాశ్రయానికి ఆయన వెళ్లారు. అక్కడ మంత్రి నారా లోకేష్ కేంద్ర మంత్రికి ఎమ్మెల్యే దగ్గుపాటిని పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... అనంతపురం అర్బన్‌లో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని, వ్యవసాయ, అనుబంధ రంగ పరిశ్రమలు ఏర్పాటుచేయాలని కోరారు. తర్వాత పుట్టపర్తి పర్యటన ముగించుకుని వెళ్తున్న కేంద్రమంత్రి చౌహాన్‌కు, మంత్రి నారా లోకేష్‌కు వీడ్కోలు పలికారు.

తాటిచెర్లలో స్వచ్ఛతా పక్వాడా

అనంతపురంరూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిచెర్లలో గురువారం హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ సిబ్బంది స్వచ్ఛత పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి వ్యక్తిగత పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం రాంకుమార్, హెచ్‌పీసీఎల్ చాప్‌స్టేషన్ మేనేజర్ అభిమన్యుదాస్, మేనేజర్ నాగార్జునరెడ్డి, సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్ల బాధ్యతల స్వీకరణ

రాప్తాడు, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరూరు, బుక్కచెర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల నూతన చైర్మన్‌లుగా ఎంపికైన మరూరు గోపాల్, బుక్కచెర్ల బ్రహ్మానందరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. మరూరు, బుక్కచెర్ల గ్రామాల్లోని సొసైటీ కార్యాలయాల్లో సీఈఓల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు.

రైతు ద్రోహి వైఎస్ జగన్

అనంతపురం క్రైం, జూలై 10(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ రైతు ద్రోహి అంటూ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దేవళ్ల మురళి ఫైర్ అయ్యారు. స్థానిక తన కార్యాలయంలో గురువారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. గత వైసీపీ పాలనలో రైతులు అన్ని విధాలా నష్టపోయారన్నారు. అయినా అప్పటి సీఎం జగన్ రైతులపై జాలి చూపలేదన్నారు. ఇప్పుడు చిత్తూరు జిల్లాలో రైతు యాత్ర పేరుతో మాయమాటలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

మధ్యవర్తిత్వం ఉత్తమ మార్గం

అనంతపురం క్రైం, జూలై 10(ఆంధ్రజ్యోతి): వివాదాలు, కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం మంచి మార్గమని డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో గల న్యాయ సేవాసదన్‌లో గురువారం ఆయన బ్యాంక్ అధికారులు, బీమా కంపెనీలు, చిట్‌ఫండ్స్ కంపెనీ ప్రతినిధులు, కక్షిదారులతో అవగాహన సదస్సు నిర్వహించి ఈ మేరకు మాట్లాడారు. తర్వాత శిక్షకులు హరికృష్ణ మధ్యవర్తిత్వం వల్ల కలిగే లాభాలను వివరించారు.

మత్స్యకారులు పథకాలను వినియోగించుకోవాలి

అనంతపురం అర్బన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మత్స్యకారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎఫ్‌డీఓలు హనీఫ్, లక్ష్మీనారాయణ, బాబూ నాయక్ సూచించారు. జాతీయ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మత్స్యశాఖ ఏడీ కార్యాలయ ఆవరణంలో గురువారం వారు మత్స్యకారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకారుల దినోత్సవ ఆవశ్యకతను వివరించారు.

సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై10(ఆంధ్రజ్యోతి): పదోన్నతుల రిజర్వేషన్లపై ఏపీ ఉమ్మడి హైకోర్టు కామన్ ఆర్డర్‌కు సంబంధించి ఏపీ ప్రభుత్వం ఐఏఎస్ అధికారుల కమిటీని నియమించడం ఎస్సీ, ఎస్టీలకు ఎంతో పారదర్శకంగా న్యాయం జరుగుతుందని ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ పేర్కొన్నారు. ఇందుకు అనుకూల సిఫారసులు చేసిన సీఎం చంద్రబాబును గురువారం ఆయన కొత్తచెరువులో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఒంటికాలిపై వినూత్న నిరసన

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఒంటికాలిపై నిలబడి వినూత్న నిరసన తెలిపారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు వెంకట నారాయణ, అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గోపాల్, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఓబుళపతి, మురళీ, నాయకులు పోతలయ్య, సుబ్బిరెడ్డి, రవికిరణ్, లోక్‌నాథ్, శివన్న, లక్ష్మి, వెంకటేశ్వరమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

● షిర్డీసాయి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: గురుపౌర్ణమి వేడుకలు అనంతపురం అర్బన్, రాప్తాడు, శింగనమల నియోజవర్గాల్లో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా షిర్డీ సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో జరిపారు. వేకువజామునే అర్చకులు సాయిబాబా మూలవిరాట్‌లకు పలు అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం విశేష పూజలు, హోమాలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం సమయంలో బాబా చిత్రపటాన్ని పల్లకిలో ఉంచి సాయినామ స్మరణ చేస్తూ పురవీధుల గుండా ఊరేగించారు. నగరంలోని మూడో రోడ్డులో గల షిర్డీసాయి ఆలయంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ స్వామి వారిని దర్శించుకున్నారు. వేమన టెలిఫోన్ భవన్ ఎదురుగా వున్న ఆలయంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సాయినాథుడిని దర్శించుకున్నారు వేణుగోపాల్‌నగర్‌లోని సద్గురు సాయినాథమందిరంలో జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ స్వామిని దర్శించుకున్నారు.

బాబా పాదాల చెంత శునకం...

రామచంద్రనగర్ షిర్డీసాయి ఆలయంలో మధ్యాహ్న హారతి ముగిశాక భక్తుల రద్దీ తగ్గింది. ఆ సమయంలో ఓ శునకం ఆలయంలోకి ప్రవేశించి దాదాపు 2 గంటల పాటు బాబా పాదాల చెంతనే కూర్చుండిపోయింది. ఈ దృశ్యాన్ని గమనించిన భక్తులు ఇది సాయినాథుడి మహిమేనని, బాబా సజీవంగా ఉన్న కాలంలో శునకాలపై ఎంతో మమకారం చూపేవారంటూ గుసగుసలాడారు.


బుక్కరాయసముద్రం చెరువుకట్టపై ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు


చెరువుకట్ట ఆలయంలో దర్శనంకోసం వేచిఉన్న భక్తులు


రామచంద్రనగర్‌లో అన్నప్రసాద వితరణలో భక్తులు


రామచంద్రనగర్ ఆలయంలో బాబా పాదాల చెంత శునకం

న్యూస్ బాక్స్

తాగునీటి సమస్యపై రాస్తారోకో


రోడ్డుపై బైఠాయించిన పిన్నేపల్లి గ్రామస్థులు

యాడికి, జూలై 10(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని మండలంలోని పిన్నేపల్లి గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం యాడికి గ్రామపంచాయతీ కార్యాలయం ఎదురుగా రోడ్డుపై బైఠాయించారు. గ్రామంలో కొన్ని కాలనీల్లో ఐదురోజులకు ఒక్కసారి కూడా కొళాయిలకు నీరు రావడం లేదన్నారు. సమస్య చెబుదామని పంచాయతీ కార్యాలయానికి వస్తే సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని వాపోయారు. దీంతో తాము రోడ్డుపై బైఠాయించాల్సి వచ్చిందన్నారు. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు ఆ గ్రామస్థులకు సర్దిచెప్పారు. సమస్యను పరిష్కరిస్తామని డిప్యూటీ ఎంపీడీఓ శశికళ హామీ ఇవ్వడంతో ఆ గ్రామస్థులు శాంతించారు.

పరీక్ష ఫలితాలు విడుదల

గుంతకల్లు టౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ శంకరానంద గిరిస్వామి డిగ్రీ కళాశాల (అటానమస్) రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను గురువారం విడుదల చేశారు. కళాశాల డైరెక్టర్ గోపాల్ మాట్లాడుతూ.. పరీక్ష ఫలితాలను కళాశాల వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఈ సెమిస్టర్‌లో ఎక్కువశాతం అమ్మాయిలే ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, పరీక్షల నియంత్రణ అధికారి నటరాజ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దారుగా చంద్రమోహన్‌రావు

విడపనకల్లు, జూలై 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇన్‌చార్జి తహసీల్దారుగా చంద్రమోహన్‌రావు గురువారం బాధ్యతలు చేపట్టారు. 15 రోజుల క్రితం ఇక్కడ తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన ఓబుళేసు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లటంతో ఉరవకొండలోని రేషన్ గోడౌన్‌లో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దారును ఇక్కడ ఇన్‌చార్జిగా నియమించారు.

ఆదర్శభారతి సొసైటీ అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌గుప్తా



కణేకల్లు, జూలై 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శభారతి సొసైటీ అధ్యక్షుడిగా చంద్రశేఖర్ గుప్తా గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనేక ఏళ్లుగా టీడీపీలో సేవలు అందించిన తనకు స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఈ బాధ్యతలు అప్పగించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అతన్ని స్థానిక టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజు, బీటీ రమేష్, చాంద్‌బాషా, కురుబ నాగరాజు, నాగప్ప సన్మానించారు.

నేడు యర్రగుంటకు మంత్రి

కణేకల్లు, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం మండలంలోని యర్రగుంటలో పర్యటించనున్నట్లు కన్వీనర్ లాలెప్ప, వన్నారెడ్డి పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ప్రారంభిస్తారని, సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో స్థానిక విప్ కాలవతో పాటు పాల్గొంటారని వారు చెప్పారు.

గ్రామాల్లో సుపరిపాలనకు తొలి అడుగు

రాయదుర్గం/బొమ్మనహాళ్, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాయదుర్గంలోని 16వ వార్డులో, బొమ్మనహాళ్ మండలం కళ్లుహోళ గ్రామంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు గురువారం నిర్వహించారు. తుంగభద్ర ప్రాజెక్ట్ కమిటీ వైస్‌చైర్మన్ కేశవరెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ హనుమంతరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జునతో కలిసి ఆయన పర్యటించారు.

జూనియర్ అసిస్టెంట్ మృతి


అనిల్ (ఫైల్)

గుత్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంఎస్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్ అనిల్ (45) అనారోగ్యంతో గురువారమ మరణించారు. పట్టణంలోని కోట వీధిలో నివాసముంటున్న వారం కిందట అనారోగ్యానికి గురై కర్నూలు ఆస్పత్రిలో చేశారు. చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. ఆయన మృతి పట్ల స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

సొసైటీ చైర్మన్‌కు సన్మానం

గుమ్మఘట్ట, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులును, కలుగోడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ నీలగంటి తిమ్మప్పను కలుగోడు టీడీపీ నాయకులు, రైతులు గురువారం సన్మానించారు. కార్యక్రమంలో కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌చార్జ్ కాలవ సన్నన్న, బీటీ ప్రాజెక్ట్ చైర్మన్ కాలవ రాజు పాల్గొన్నారు.

భీమలింగేశ్వరస్వామికి బిందె సేవ


గ్రామ వీధుల్లో ఊరేగుతున్న స్వామివారు

విడపనకల్లు, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేకల్లులో గురువారం భీమలింగేశ్వరస్వామి బిందె సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఊరు బావిలో గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను బావి వద్ద ఉంచి పూజలు నిర్వహించి బిందె సేవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బిందె సేవలో భాగంగా స్వామి వారిని, లక్ష్మమ్మ అవ్వను గ్రామ వీధుల్లో ఊరేగిస్తూ.. ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయంలోని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు.కార్యక్రమంలో అర్చకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వేపకాయలతో ఉపాధి


వేపకాయలు ఏరుకుంటున్న వృద్ధురాలు

యల్లనూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనులకు వెళ్లలేని వృద్ధులకు వేపకాయలు ఉపాధి చూపుతున్నాయి. వేప ఉత్పత్తులకు వ్యవసాయంలో మంచి డిమాండ్ ఉండడంతో వేపకాయలు కొనుగోలుకు వ్యాపారులు మొగ్గుచూపుతున్నారు. వ్యాపారులు కేజీ వేపకాయలను రూ.20లకు కొంటున్నారు. ఈ ఏడాది వేపచెట్లకాపు ఆశించిన స్థాయిలో ఉండడంతో అనేక మంది వృద్ధులకు ఉపాధి దొరికనట్లైంది. ఒక్కొక్కరూ ప్రతిరోజూ 15 నుంచి 20 కేజీల వరకు సేకరించి అమ్ముతున్నారు. వ్యాపారులు సైతం గ్రామాల్లో ఇంటింటికి తిరిగి మరీ వీటిని కొనుగోలు చేస్తున్నారు.


సజ్జలదిన్నె పాఠశాలలో ఎంపీ అంబికాతో విద్యార్థులు



రాయదుర్గంలో మాట్లాడుతున్న విప్ కాలవ


గుత్తిలో బహుమతులను అందజేస్తున్న వెంకటశివుడు యాదవ్

పండుగలా మెగా పీటీఎం

పలు పాఠశాలల్లో మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: గుంతకల్లు, తాడిపత్రి, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదురం నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం పండుగ వాతావరణంలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను నిర్వహించారు. పలు పాఠశాలలకు మామిడి ఆకులతో తోరణాలు కట్టారు. రంగురంగుల ముగ్గులు వేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. పలు పాఠశాలల్లో మొక్కలు నాటారు... పంపిణీ చేశారు. ఉరవకొండ ప్రభుత్వ జూనియర్స్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ వినోద్ కుమార్ పాల్గొన్నారు. అలాగే తాడిపత్రి మండలంలోని సజ్జలదిన్నె గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, రాయదుర్గంలోని బాలగంగాధర తిలక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే గుత్తి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, బాలికల ఉన్నత పాఠశాలలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, కళ్యాణదుర్గం కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, శెట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, తాడిపత్రి మెయిన్‌బజారులోని బాలికల ఉన్నత పాఠశాల, పుట్లూరు రోడ్డు బైపాస్‌లో ఉన్న కేజీబీవీలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పాల్గొన్నారు. బొమ్మనహాళ్ కేజీబీవీలో విద్యార్థినులు తల్లులకు పాదపూజ చేశారు. ఉద్దేహాళ్ జిల్లాపరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థి అచారి కీర్తన విప్ కాలువ చిత్రం గీసి ఆకట్టుకొంది. కూడేరు మండలం చోళసముద్రం పాఠశాలలో సర్పంచు వడ్డే రమాదేవి మొక్కలు నాటారు. పెద్దవడుగూరు ప్రభుత్వ పాఠశాలలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, జిల్లా తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ దివాకర్‌రెడ్డి విద్యార్థులకు మొక్కల పంపిణీ చేశారు. రాయదుర్గం మం డలం 74 ఉడేగోళం పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన వసుంధరకు రూ. ఐదు వేలు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. బెళుగుప్పలోని శ్రీనివాస విద్యానికేతన్‌లో సింగిల్ పేరెంట్ విద్యార్థులకు ఆ పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు రూ. 50 వేల విలువైన పుస్తకాలను అందజేశారు.








శెట్టూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, తాడిపత్రిలో విద్యార్థినులతో ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి, బొమ్మనహాళ్‌లో తల్లులకు విద్యార్థుల పాదపూజ, చోళసముద్రంలో మొక్క నాటుతున్న సర్పంచు వడ్డే రమాదేవి

వైభవంగా ఉట్ల పరుష




రుక్మిణీ సమేత విఠోబాస్వామి ఊరేగింపు, ఉట్టి కొడుతున్న యువకులు

పామిడి, జూలై 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగసుబే ఫిర్కా భావసార క్షత్రియ సమాజ్, డబ్బిదార్ ఫిర్కా భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉట్ల పరుష వైభవంగా జరిగింది. మొదట బ్రహ్మరథంపై రుక్మిణి సమేతంగా విఠోబ స్వామిని పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం పెద్ద పాండురంగస్వామి దేవాలయం నుంచి ఒక ఉట్టిని, రంగ సుభేఫిర్కా భగవాన్ దాస్ విఠోబస్వామి దేవాలయం నుంచి ఒక ఉట్టిని భక్తులు మేళతాళాలతో తీసుకువచ్చి ఉట్ల మానుకు కట్టారు. వందలాది మంది యువకులు ఉట్లు కొట్టేందుకు పోటీ పడ్డారు. పగిలిన ఉట్లు నుంచి జాలువారే ప్రసాదం కోసం భక్తులు పోటీపడ్డారు. వేలాది మంది భక్తులతో వీధులు కిటకిటలాడాయి.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు


విద్యార్థినికి నగదు బహుమతి అందజేస్తున్న బసవరాజు

కణేకల్లు, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపులాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బసవరాజు పూలచెర్ల ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు గురువారం ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. 543 మార్కులు సాధించి అన్వితకు రూ. 25 వేలు, 527 మార్కులు సాధించిన శ్రీవల్లికి రూ. 10 వేలు, 446 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచిన స్పందన, మారుతికు చెరో రూ. ఐదువేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బషీర్‌అహ్మద్, టీడీపీ నాయకులు నగేష్‌రెడ్డి, పుల్లంపల్లి ప్రభాకర్, సర్దార్, మంజు పాల్గొన్నారు.

నెట్టికంటి ఆలయం చుట్టూ అపరిశుభ్రత

- కసాపురంలో మెరుగుపడని డ్రైనేజీ వ్యవస్థ
- నిధులిస్తున్నా.. ప్రయోజనం శూన్యం






రామదూత నిలయం సమీపంలో ఉన్న డ్రెయిన్, ఊరువాకిలి వద్ద ఉన్న మురుగు కాలువ, దేవస్థాన ప్రవేశ ద్వారం వద్ద ఉన్న దిబ్బ

గుంతకల్లు, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానం చుట్టూ అపరిశుభ్రత తాండవిస్తోంది. కసాపురంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఈ సమస్య ఏర్పడుతోంది. ఆ ప్రభావం దేవస్థానంపై కూడా పడుతోంది. భక్తులకు ఆలయ పరిసరాల్లోకి రాగానే దుర్వాసన వస్తోంది. గ్రామం పైతట్టు ఉండటం, దేవస్థానం దిగువన ఉండటంలో ఊరి నుంచి వచ్చిన మురుగునీరు దేవస్థాన పరిసరాల్లో నుంచి వెళ్తుండటం సమస్యగా మారుతోంది.

● మెరుగుపడని మురుగునీటి వ్యవస్థ గ్రామం నుంచి వచ్చే డ్రెయినేజీ నీరు ఊరు వాకిలి ద్వారా ప్రధాన రహదారిని దాటుకుని దేవస్థానం పక్క నుంచీ ముందుకు వెళుతుంది. ఈ డ్రెయిన్ సక్రమంగా లేకపోవడంతో ఊరువాకిలి, రామదూత నిలయం, ఆలయ ప్రధాన రహదారిలో అపరిశుభ్రత తాండవిస్తోంది. ఇటీవల ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఈ గ్రామాన్ని సందర్శించినప్పుడు స్థానికులు ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

● ఆలయ పరిసరాల్లో దిబ్బలు: దేవస్థానానికి సమీపంలో గ్రామస్థులు పశువుల పాకలను నిర్వహిస్తూ దిబ్బలను వేశారు. అలాగే దేవాలయ ప్రాంగణ ప్రవేశ ద్వారం వద్ద శివాలయం నుంచి వెలువడే చెత్తను రోడ్డు పక్కనే డంప్ చేశారు. స్థానికులు కూడా పేడ, గంజు తదితర వాటిని అక్కడ వేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. ప్రవేశ ఆర్చి వద్దనే కొందరు పశువులను కట్టేస్తున్నారు.

● నిధులున్నా...: కసాపురం దేవస్థానం నుంచి పంచాయతీకి ప్రతి సంవత్సరం రూ. 50 వేలు ఇస్తున్నారు. దేవస్థానం కారణంగా కసాపురం గ్రామానికి ఆదాయమూ బాగా వస్తోంది. అయినా అధికారులు మురుగు వ్యవస్థను మెరుగుపరచడంలో నిర్లక్ష్యం చూపుతున్నారు.

రస్తా వివాదంపై విచారణ

రాయదుర్గం రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కాపురం గ్రామంలోని గ్రామకంఠం రస్తా వివాదంపై తహసీల్దార్ నాగరాజు గురువారం విచారణ చేపట్టారు. గ్రామంలో పూర్వం నుంచి రస్తా ఉండగా కంపౌండ్ వాల్ ఏర్పాటు చేయడంతో పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రైతులు ఇటీవల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఈ విచారణ చేపట్టారు. గ్రామంలో గ్రామకంఠం స్థలం ఉందని, ఆ స్థలంలో ఇళ్లు నిర్మిస్తే ఎలా అని ప్రశ్నించారు. గ్రామంలో గ్రామకంఠం స్థలంపై సర్వే నిర్వహించి రస్తా సమస్యను పరిష్కరిస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్ : గురుపౌర్ణమి వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలుసాయిబాబా ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నసంతర్పణం చేశారు. షిర్డీ సాయి బాబా చిత్రపటాన్ని, విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఉంచి ఊరేగించారు. సాయి వ్రతాన్ని, పల్లకి సేవలను చేపట్టారు. గుత్తి మండలంలోని సేవాఘడ్‌లోని సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. సేవాఘడ్‌లో పురవీధుల గుండా పల్లకిలో ఊరేగించారు. తాడిపత్రి మండలం చిన్నపొలమడలో ప్రబోధానంద స్వామి ఆశ్రమంలో శ్రీలంక నుంచి బౌద్ధభిక్షువు కోవానే పాలితెరో జపాన్ దేశం నుంచి జపాన్‌మాంక్ యుషిజీ పాల్గొని బోధించారు. ఉరవకొండలోని దుర్గా భవాని ఆలయంలో అమ్మవారు శాకంబరీ దేవిగా అలంకరించారు. పామిడిలోని అనఘా ఆత్రేయ దత్తపాదుకా క్షేత్రంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.




యాడికిలో సాయిబాబాకు అలంకరణ, గుంతకల్లులో సాయి వ్రతాన్ని నిర్వహిస్తున్న అర్చకులు








కూడేరు, శెట్టూరు, తాడిపత్రిలో షిర్డిసాయిబాబాకు అలంకరణ, సేవాఘడ్‌లో సేవాలాల్ మహరాజ్

క్రైం న్యూస్ ..

పేట్రేగిన కేబుల్‌వైరు దొంగలు

ఒకే రాత్రి 12 బోరుబావుల తీగల చోరీ

యాడికి, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని దైవాలమడుగులో బుధవారం రాత్రి కేబుల్‌వైరు దొంగలు పేట్రేగిపోయారు. 12 మంది రైతులకు చెందిన వ్యవసాయ బోరుబావుల వద్ద కేబుల్‌వైరును కట్ చేసుకొని వెళ్లారు. చంద్ర, సుధాకర్, గోపాల్, సుబ్బరాయుడు, హరి తదితర రైతులకు చెందిన సుమారు 300 మీటర్ల కేబుల్‌వైరు చోరీ అయినట్లు తెలిపారు. దీనివిలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందన్నారు. దీంతో నీరు లేక పంటలు ఎండుతున్నాయని, పోలీసులు చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

కుక్కదాడిలో 10 గొర్రెలు మృతి

బొమ్మనహాళ్, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్ణాపురం గ్రామంలో గురువారం ఉదయం కుక్క దాడి చేయడంతో రామన్నకు చెందిన పది గొర్రెలు మరణించాయి. దీంతో తనకు రూ. 70 వేలు నష్టం కలిగిందని, ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు. గ్రామంలో వీధి కుక్కలు అధికమయ్యాయని, వాటిని నియంత్రించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

గుత్తిరూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాచుపల్లి గ్రామశివారులోని జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన శ్రీరాములు గాయపడ్డాడు. అతను గుత్తి నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా.. అదుపు తప్పి పడడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గుత్తిరూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతాపల్లి గ్రామానికి చెందిన వంశీ విషపు ద్రావం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సమస్యలతో బాధపడుతున్న వంశీ జీవితంపై విరక్తి చెంది.. గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతన్ని కుటుంబ సభ్యులు గుర్తించి.. వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రాథమిక దశలోనే విద్యకు పునాది

శ్రీ శారదా విద్యావిహార్ కరస్పాండెంట్ రవికుమార్



మొక్కలు అందజేస్తున్న కరస్పాండెంట్ రవికుమార్

కళ్యాణదుర్గం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశే విద్యకు పునాది రాయిలాంటిదని, ఇక్కడే ప్రతి ఒక్కరూ కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని శ్రీ శారదా విద్యావిహార్ కరస్పాండెంట్ రవికుమార్ అన్నారు. గురువారం కంబదూరులోని శ్రీ శారదా విద్యావిహార్‌లో మెగా పేటీఎంను ఘనంగా నిర్వహించారు. తల్లికి వందన పథకం ద్వారా ప్రతి ఒక్కరికి రూ. 13 వేలు ఆర్థికసాయం అందజేసిన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థి తల్లిదండ్రులకు, విద్యార్థులకు మొక్కలు అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి సత్యంబాబు, పాఠశాల కమిటీ సభ్యులు వరదరాజు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రైల్వే ఆసుపత్రి సమస్యలు పరిష్కరించండి


సీఎండీకి సమస్యలు వివరిస్తున్న నాయకులు

గుంతకల్లు, జూలై 10(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే ఆసుపత్రిలోని సమస్యలను పరిష్కరించాలని మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్ రైల్వే చీఫ్ మెడికల్ డైరెక్టర్ (సీఎండీ)కు వినతిపత్రాన్ని సమర్పించారు. గురువారం ఉదయం సీఎండీ నిర్మలా రాజారాం రైల్వే ఆసుపత్రిలో తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్దూర్ యూనియన్ నాయకులు సీఎండీతో భేటీ అయ్యి ఆసుపత్రి సమస్యలపై చర్చించారు. రైల్వే డివిజన్‌లోని యర్రగుంట్లలో హెల్త్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ ఎన్ వేణుగోపాల్ రెడ్డి, యూనియన్ నాయకులు ఎస్‌ఎం బాషా పాల్గొన్నారు.